ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 25 మార్చి 2024





ప్రతిష్ఠాత్మకంగా 2024 ఎన్నికలు..


టి.కృష్ణప్రసాద్

2024 ఎన్నికలను అధికార, ప్రతిపక్ష పార్టీలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. భావపురిపై జెండా ఎగుర వేసేందుకు అటు వైసీపీ, ఇటు టీడీపీ కూటమి నేతలు సమాయత్తమవుతున్నారు. సార్వత్రిక సమరానికి సంబంధించి టీడీపీ, వైసీపీ ఇప్పటికే అభ్యర్థులపై స్పష్టత ఇచ్చాయి. 2019లో వైసీపీ నుంచి పోటీ చేసి గెలుపొందిన నందిగం సురేష్ రెండో సారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. టీడీపీ తరపున ఐపీఎస్‌గా ఉమ్మడి రాష్ట్రంలో సేవలందించిన టి.కృష్ణప్రసాద్ బరిలో ఉన్నారు. ఇరు పార్టీల శ్రేణులు ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నాయి.

ఉద్దండుల ఖిల్లాగా బాపట్ల..

బాపట్ల స్థానం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన వారంతా ఉద్దండులే. ఆది నుంచి ఈ స్థానం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ ప్రభ తగ్గిపోయి వైసీపీ బరిలోకి వచ్చింది. బాపట్ల లోక్‌సభ పరిధిలోని కారంచేడు సినీ నిర్మాత రామానాయుడు స్వస్థలం కావడంతో బాపట్ల నుంచి ఎంపీగా గెలుపొందిన ఆయన అభివృద్ధి విషయంలో తనదైన మార్కు చూపారు. ఎంపీ నిధులే కాకుండా సొంత ధనంతో అనేక కార్యక్రమాలను చేశారు. ఎన్టీఆర్ కుమార్తె, భారతీయ జనతా పార్టీ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షురాలైన పురందేశ్వరి ఈ జిల్లా కోడలే. దగ్గుబాటి వెంకటేశ్వరరావుతో పాటు సతీమణి పురందేశ్వరి కూడా ఇదే స్థానం నుంచి లోక్‌సభలో అడుగుపెట్టారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలోనే విద్య అభ్యసించిన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఇదే స్థానం నుంచి లోక్‌సభలో అడుగుపెట్టారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి సైతం ఇక్కడ నుంచి లోక్‌సభలోకి అడుగుపెట్టారు. కాంగ్రెస్ తరపున గెలుపొందిన పనబాకలక్ష్మి కేంద్ర మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. సలగల బెంజిమెన్, మాల్యాద్రి శ్రీరాం కూడా బాపట్ల అభివృద్ధిలో తమదైన మార్కు చూపెట్టారు. ఉపరాష్ట్రపతిగా అత్యున్నత పదవి అధిరోహించిన వెంకయ్య నాయుడు సైతం బీజేపీ నుంచి 1989లో బాపట్ల లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగి పరాజయం పాలయ్యారు.


మాల్యాద్రి


పనబాక లక్ష్మి


పురందేశ్వరి


రామానాయుడు

భావపురి.. చైతన్య దీపిక

2024 సార్వత్రిక ఎన్నికల సమరం సమీపిస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. ఆయా పార్టీల ప్రచారాలు ఊపందుకున్నాయి. ఈ సారి షెడ్యూల్‌కు పోలింగ్‌కు మధ్య వ్యవధి 65 రోజులు వచ్చింది. అంటే సుమారు రెండు నెలలకు పైగా ప్రచారాలు నిర్వహించుకునే అవకాశం అభ్యర్థులకు వచ్చింది. అయితే ప్రచార ఖర్చులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అభ్యర్థులు, రాజకీయ పక్షాలు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాను గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజించారు. దీంతో ఈ మూడు జిల్లాల పరిధిలో మూడు లోక్‌సభ, 20 అసెంబ్లీ నియోజకవర్గాలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గాల వారీగా చరిత్రను పాఠకులకు అందించే ప్రయత్నమిది...


ప్రసాద్‌రావు

బాపట్ల ప్రత్యేకతలు ఇవి..

ఐదో శతాబ్దం నాటి భావనారాయణస్వామి ఆలయంతో ఈ ప్రాంతానికి భావపురిగా ఘనత వహించింది. కాలాంతరాన భావపురి బాపట్లగా మారింది. చారిత్రక నేపథ్యం ఉన్న బాపట్ల.. స్వాతంత్ర్య సమరంలో ఎన్నో కీలక ఘట్టాలకు వేదికగా నిలిచింది. దాదాపు 70 కిలో మీటర్ల మేర ఉన్న తీర ప్రాంతం బాపట్ల సొంతం. కార్తీకమాసంలో సూర్యలంక సముద్ర తీరానికి లక్షల సంఖ్యలో భక్తులు స్నానానికి పోటెత్తుతారు. దక్షిణ భారతదేశంలో తొలిగా వ్యవసాయ కళాశాల బాపట్లలో 1945 జూలై 11న మొదలైంది. ఇక్కడే బీపీటీ- 5204 సాంబా మసూరి వరి వంగడాన్ని ప్రముఖ శాస్త్రవేత్త ఎంవీ రెడ్డి ఆవిష్కరించారు. బాపట్ల జీడి మామిడి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తయారు చేసిన బీపీపీ-8 వంగడం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇక్కడ వ్యవసాయ విద్యనభ్యసించిన విద్యార్థులు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా వివిధ రంగాల్లో కీర్తి గడించారు. ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీకి అనుబంధంగా జీడిమామిడి పరిశోధనా కేంద్రం, నూతన వంగడాల పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు తన వంతుగా సేవలందించడంలో బాపట్ల విరాజిల్లుతోంది. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీలో భాగమై ఉన్న కళాశాలలు బాపట్లను విద్యల కాణాచిగా మార్చాయి. రాష్ట్రంలో పొడవైన సముద్ర తీరప్రాంతం కలిగిన జిల్లా. ఆక్వా రంగానికి కేంద్రంగా బాపట్ల ఉంది. ఏటా రూ.1200 కోట్ల విలువైన రొయ్యల పిల్లలు, చేపలను ఎగుమతి జరుగుతుంది. బాపట్ల లోక్‌సభ పరిధిలోని చీరాల వస్త్ర పరిశ్రమకు ప్రధాన కేంద్రం. మార్టూరు గ్రానైట్ పరిశ్రమల కేంద్రంగా గుర్తింపు ఉంది.

14,96,873
మొత్తం ఓట్లు

7,66,153
మహిళలు

7,30,642
పురుషులు


78
ఇతరులు

బాపట్ల లోక్‌సభ పూర్వపరాలు..

బాపట్ల లోక్‌సభ స్థానంగా ఏర్పడక ముందు తెనాలి లోక్‌సభ పరిధిలో ఉండేది. లోక్‌సభ స్థానాల పునర్విభజనలో భాగంగా బాపట్ల లోక్‌సభ స్థానంగా 1977లో ఆవిర్భవించింది. 2004 వరకు జనరల్ స్థానంగా ఉండగా 2009 నుంచి ఎస్సీ రిజర్వ్‌గా మార్చారు. 2009లో చేపట్టిన అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పొన్నూరు స్థానం గుంటూరు లోక్‌సభలోకి వెళ్లగా ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు బాపట్ల లోక్‌సభ పరిధిలో చేరింది. గతంలో ఈ స్థానం ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉండేది. ఉమ్మడి గుంటూరు పరిధిలోని వేమూరు, బాపట్ల, రేపల్లెతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని సంతనూతలపాడు, పర్చూరు, అద్దంకి, చీరాల ఉండేవి. బాపట్ల జిల్లాగా ఆవిర్భవించాక ఒక్క సంతనూతలపాడు మినహాయిస్తే మిగిలిన ఆరుస్థానాలు ఈ జిల్లా పరిధిలోకి వచ్చాయి. జిల్లాగా ఏర్పడ్డాక తొలిసారి బాపట్ల లోక్‌సభకు ఎన్నిక జరగబోతోంది. ప్రస్తుతం బాపట్ల జిల్లాలోని ఆరుస్థానాలతో పాటు ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు బాపట్ల లోక్‌సభ పరిధిలో ఉన్నాయి.

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1977	అంకినీడు ప్రసాద్‌రావు	కాంగ్రెస్	జె. చంద్రమౌళి	బీఎల్‌డీ	42,946
1980	అంకినీడు ప్రసాద్‌రావు	కాంగ్రెస్	పి.సాంబయ్య	జనతా	1,51,741
1984	చిమటా సాంబు	టీడీపీ	ఎం. రాజేశ్వరరావు	కాంగ్రెస్	34,420
1989	సలగల బెంజిమెన్	కాంగ్రెస్	ఎం. వెంకయ్యనాయుడు	బీజేపీ	43,620
1991	దగ్గుబాటి వెంకటేశ్వరరావు	టీడీపీ	సలగల బెంజిమెన్	కాంగ్రెస్	1097
1996	ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు	టీడీపీ	విజయ ప్రసాద్ ఆర్య	కాంగ్రెస్	8,262
1998	నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి	కాంగ్రెస్	ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు	టీడీపీ	40,488
1999	డి. రామానాయుడు	టీడీపీ	జేడీ శీలం	కాంగ్రెస్	92,457
2004	దగ్గుబాటి పురంధేశ్వరి	కాంగ్రెస్	రామానాయుడు	టీడీపీ	94,082
2009	పనబాక లక్ష్మీ	కాంగ్రెస్	మాల్యాద్రి శ్రీరామ్	టీడీపీ	69,338
2014	మాల్యాద్రి శ్రీరాం	టీడీపీ	వరికూటి అమృతపాణి	వైసీపీ	32,754
2019	నందిగం సురేష్	వైసీపీ	మాల్యాద్రి శ్రీరాం	టీడీపీ	16,065


చిమటా సాంబు


బెంజిమెన్


వెంకటేశ్వరరావు


నేదురుమల్లి


ఉమ్మారెడ్డి


సురేష్

బాపట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చారిత్రక నేపథ్యం.. స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర.. సుందరమైన సముద్రతీరం.. విద్యలకు కాణాచి.. ఉద్యమాల గడ్డ.. ఆధ్యాత్మిక కేంద్రం.. పర్యాటక ప్రాంతం బాపట్ల సొంతం. అనేక ఉద్యమాలకు ఊపిరులూదిన గడ్డగా బాపట్ల చరిత్రకెక్కింది. భారతీయ వాయుసేన కేంద్రం, దక్షిణ భారతదేశపు తొలి వ్యవసాయ విద్యాలయం, ఐదో శతాబ్దం నాటి భావనారాయణ స్వామి ఆలయం, భట్టిప్రోలు స్తూపం, సూర్య లంక సముద్రతీరం, చీరాల దగ్గర ఓడరేవు బాపట్ల సొంతం. 1794లోనే బాపట్ల తాలూకా ఏర్పడింది. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలన్న భావనకు బాపట్ల టౌన్ హాలులో 1913 మే 26, 27న నిర్వహించిన ప్రథమాంధ్ర మహాసభలలో బీజంపడింది. స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో 1919లో నిర్వహించిన చీరాల-పేరాల ఉద్యమం జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న బాపట్ల నుంచి గెలిచి లోక్‌సభలోకి అడుగుపెట్టిన వారిలో మహామహులు ఉన్నారు. 1977లో బాపట్ల లోక్‌సభ నియోజకవర్గంగా ఆవిర్భవించింది. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వచ్చిన వారంతా ఖ్యాతిని ఆర్జించిన వారే. గత చరిత్ర కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నా ప్రతి పక్షాలనూ ఆదరించిన ఘనత ఈ స్థానం సొంతం. ఇప్పటి వరకు 12 సార్లు ఎన్నికలు జరగ్గా ఆరు సార్లు కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేయగా, ఐదు సార్లు టీడీపీ, ఒకసారి వైసీపీ గెలుపు తీరాలకు చేరాయి. పురుషుల కంటే 36 వేల మంది ఎక్కువగా మహిళా ఓటర్లు ఉన్నారు. దీంతో ఇక్కడ బరిలో నిలిచే అభ్యర్థుల గెలుపు ఓటముల్లో మహిళా ఓటర్లదే కీలకపాత్ర.

- మహామహుల ప్రాతినిధ్యం బాపట్ల సొంతం
- 1977లో లోక్‌సభ స్థానంగా బాపట్ల ఆవిర్భావం
- 2009 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మార్పు
- గెలుపోటముల్లో మహిళల ఓట్లే కీలకం

నియోజకవర్గ ముఖచిత్రం

జిల్లాగా ఆవిర్భావం.. మౌలిక వసతుల కొరత

2022 ఏప్రిల్ 4న జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా బాపట్ల జిల్లాగా ఆవిర్భవించింది. లోక్‌సభ స్థానాలను జిల్లాలుగా చేయాలనే ప్రభుత్వ పాలసీ ప్రకారం భావపురి జిల్లా కేంద్రమైంది. గుంటూరు జిల్లా నుంచి వేమూరు, రేపల్లె, బాపట్ల, ప్రకాశం జిల్లా నుంచి చీరాల, పర్చూరు, అద్దంకిలతో బాపట్ల నూతన జిల్లాగా ఏర్పాటైంది. జిల్లాలోని ఆరు స్థానాలు బాపట్ల లోక్‌సభ నియోజక వర్గ గొడుగు కిందకు రాగా ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు మాత్రమే బాపట్ల లోక్‌సభ స్థానం పరిధిలో ఉంది. జిల్లాగా ఏర్పడినా బాపట్లలో అనేక మౌలిక వసతులు లేవు. పాలకులు కొంచెం ఊతమిస్తే అటు పర్యాటకంగా.. ఇటు వ్యాపార, విద్య, వాణిజ్య కేంద్రంగా బాపట్ల అభివృద్ధి చెందుతుంది. బాపట్ల --చీరాల జంట నగరాలుగా బాసిల్లే అవకాశం ఉంది.

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

ఎస్సీ(మాల)	-1,97,000
ఎస్సీ(మాదిగ)	-1,49,000
రెడ్డి	-1,20,027
కమ్మ	-1,84,470
కాపు	-1,36,000
ముస్లిం	-80,000
ఎస్టీ	-35,000
యాదవ	-1,17,000
చేనేతలు	-63,000
మత్స్యకార	-35,000
గౌడ	-64,000
వైశ్య	-60,000
ఇతరులు	-2 లక్షలకు పైగా

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(సోమవారం)
సహార్ (ఉదయం) 4.52 (మంగళవారం)



పనులు చేసినా.. పస్తులే!

- రెండు నెలలుగా ఎదురుచూపులు
- అందని ఉపాధి వేతన బిల్లులు
- కూలీ రూ.38.77 కోట్ల బకాయిలు
- మెటీరియల్ బిల్లుల బకాయి రూ.58.93 కోట్లు

ఉపాధి.. ఉత్తిత్తిగా మారింది. కూలీలు పనులు చేస్తున్నారు.. అయితే వారికి వారం కాదు కదా నెలకు కూడా కూలి చెల్లించడం లేదు. జనవరి నుంచి ఇప్పటివరకు పనులు చేసిన కూలీ లకు ఉపాధి సొమ్ములు చెల్లించలేదంటే పరిస్థితి అర్థం చేసుకో వచ్చు. వలసలు నివారించడం, వ్యవసాయ కార్మికులు, కూలీలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో లోపాలు చోటు చేసుకుంటున్నాయి. చేసిన పనికి రెండు రోజుల్లో ప్రతి కార్మికునికి కూలీ సొమ్ము వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయాల్సి ఉంది. ఈ చెల్లింపుల్లో తీవ్రజాప్యం జరుగుతోంది. నెలలు గడుస్తున్నా కష్టపడి చేసిన పని కూలీ సకాలంలో రాక పోతుండటంతో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చేసిన పనికి వేతనం అందక ఉపాధి వేతనదారులు రెండు నెలలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు రూ.38.77 కోట్లు బకాయిలు ఉండటంతో కష్టాలు తప్పడంలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేదని కష్టజీవులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాస్ పుస్తకాలు చేతపట్టుకొని బ్యాంకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఖాతాలు ఖాళీగా కనిపించడంతో నిరాశకు లోనవుతున్నారు. పనులకు సంబంధించిన సామాగ్రి బిల్లుల బకాయి రూ.58.93 కోట్లు ఉన్నాయి. ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది మండల కార్యాలయానికి వివరాలు పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రెండు రోజులకు వారి ఖాతాల్లో నగదు జమ చేయాలి. ఇదంతా జరుగుతున్నా రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించట్లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు. జనవరి 29నుంచి వేతనాలు అందకపోవడంతో మొత్తం రూ.38.77 కోట్ల బకాయిలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి వ్యక్తికి 100రోజుల పని దినాలను కూలీలకు కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. చేసిన పనికి కూలీ రాకపోతుండటంతో ఈ పనుల పట్ల కార్మికులు ఆసక్తి కనబరచడంలేదు. దీంతో ఉపాధి పథకం లక్ష్యాలు నెరవేరడం లేదు.



యంత్రాంగం అలసత్వం..

ప్రభుత్వం కార్మికుని సగటు వేతనం రూ.272గా నిర్ణయించింది. ఈ మేరకు ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు సగటు వేతనం లభించడంలేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా తమకు సగటు వేతనం అమలు చేయాలని కూలీలు కోరుతున్నారు. ఈ దిశగా ఉపాధి యంత్రాంగం చర్యలు చేపట్టాల్సి ఉంది. వ్యక్తిగత పని దినాలు కల్పించడంలో కొంత యంత్రాంగం అలసత్వంగా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా జాబ్ కార్డులు నమోదు చేశారు. ఈ జిల్లాలో 5.37 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేయబడ్డాయి. అలాగే గుంటూరు జిల్లాలో 2.03 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.52 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. నమోదు చేసుకున్నవారందరూ పనులు హాజరు కావడంలేదు. పల్నాడులో 4.36 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. బాపట్లలో 3.68 లక్షలు, గుంటూరులో 1.48 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీరు మాత్రమే ఉపాధి పనులకు హాజరౌతున్నారు. పేరు నమోదు చేసుకోని పనులకు హాజరు కాని కార్మికుల సంఖ్యలో లక్షల్లో ఉండటం గమనార్హం. వీరికి కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఉపాధి పనుల్లో కార్మికుల పనిదినాలను ముందుగానే అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పని దినాలు కల్పించడంలో అధికారులు విఫమవుతున్నట్టు లెక్కలు తెలియజేస్తున్నాయి. చేసిన పనికి రెండు నెలలుగా ఒక్క రూపాయి కూడా కూలీ చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కోట్లల్లో కార్మికుల వేతన బకాయిలు ఉన్నాయి. చేసిన కష్టానికి వేతనం చెల్లింపులో ఆలస్యం అవుతుండటం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీ చెల్లించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

వేసవి భత్యాలు రద్దు

గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20 శాతం. మార్చిలో 25 ఏప్రిల్లో 30 శాతం అదనపు వేతనం ఇచ్చేవారు. మజ్జిగ కూడా సరఫరా చేసేవారు. తాగునీటికి రూ.5, గునపానికి రూ.10, తట్టకి రూ.13 చెల్లించేవారు. ప్రస్తుతం వీటినీ రద్దు చేశారు. దీంతో వేతనదారులపై ఆర్థికభారం పడుతోంది.

మెటీరియల్ బిల్లుల బకాయి రూ.58.93 కోట్లు

కార్మికుల వేతనాలతో పాటు చేసిన పనుల మెటీరియల్ బిల్లులు నిలిచిపోయాయని బాధితులు చెబుతున్నారు. మూడు జిల్లాల్లో రూ 58.93 కోట్ల బకాయి ఉన్నట్టు సదరు శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. గుంటూరు జిల్లాల్లో రూ.16.39 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.22.49 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.20.05 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెటీరియల్ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రానైట్ ఆదాయానికి గండి

- అధికార పార్టీ అండతో బరితెగించి రవాణా
- ప్రభుత్వానికి రోజుకు రూ.50 లక్షల ఎగనామం
- ఎస్కార్ట్ ముఠాలకు, అధికారులకు కాసుల పంట
- తెలంగాణ సరిహద్దులో తనిఖీలతో అక్రమాలు బహిర్గతం



అద్దంకి/బల్లికురవ/మార్టూరు, మార్చి 24: గ్రానైట్ అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఎస్కార్ట్ ముఠాలకు, అధికారులకు కాసుల పంటగా మారింది. దీంతో అక్రమ రవాణాను మరింత బరితెగించి నిర్వహిస్తున్నారు. బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల్లోని గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి నిత్యం వందకుపైగా లారీల గ్రానైట్ ఇతర ప్రాంతాలకు ఎగుమతి జరుగుతుంది. ఒక్కో లారీలో సరాసరిన 4 వేల అడుగుల గ్రానైట్ స్లాబులు తరలిస్తుంటారు. ఈ ప్రకారం ఒక్కో లారీకి సరాసరి రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు మైనింగ్ సెస్, జీఎస్టీ కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అయితే, అంతమేర చెల్లించకుండా ఉండేందుకు రూ.30 వేల నుంచి రూ.35 వేలతో ఎస్కార్ట్ ముఠాలతో ఒప్పందం చేసుకుంటున్నారు. ఆయా లారీలను ఆంధ్ర సరిహద్దు దాటించే బాధ్యతను ఎస్కార్ట్ ముఠా యువకులు తీసుకున్నారు. స్థానిక సీనరేజ్ వసూలు టెండర్ దక్కించుకున్న సంస్థకు రూ.10 వేలు, మరికొంత మొత్తాన్ని సరిహద్దు నియోజక వర్గంలోని అధికార పార్టీ కీలక ప్రజాప్రతినిధికి, స్థానిక అధికారులకు ముట్టజెప్పున్నట్లు తెలుస్తోంది. మిగిలిన రూ.10 వేలు ఎస్కార్ట్ ముఠాలోని వారు పంచుకుంటున్నారు. ఇలా రోజుకు 60 నుంచి 70 లారీలు ఎలాంటి బిల్లులు చెల్లించకుండా రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రోజుకు సరాసరి రూ.50 లక్షలు ఎగనామం పడుతున్నట్లు తెలుస్తుంది. ఎస్కార్ట్ ముఠా సభ్యులకు అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో రవాణాను అడ్డుకునే వారే లేకుండా పోయారు. నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన ఆయా శాఖల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నరన్న విమర్శలున్నాయి. అయితే, తెలంగాణ సరిహద్దులో ఆ రాష్ట్ర అధికారులు శుక్ర, శనివారాల్లో చేపట్టిన తనిఖీలలో అక్రమ రవాణా బాగోతం మరోసారి బయటపడింది. జీఎస్టీ నుంచి పక్కదారి పట్టించేందుకు నకిలీ బిల్లులు పెడుతున్నట్లు కూడా సమాచారం. యథేచ్ఛగా గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు అడ్డుకోకపోవడం మరింత విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనిఖీలు ముమ్మరం చేసి గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రజల హృదయాలను గెలుస్తా



మంగళగిరి 23వ వార్డులో ఆదివారం రాత్రి నిర్వహించిన రచ్చబండలో ప్రసంగిస్తున్న లోకేశ్

- బ్లాక్ డెవలప్‌మెంట్ మోడల్‌లో మంగళగిరి అభివృద్ధి
- బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్, రచ్చబండ కార్యక్రమాల్లో యువనేత



వైసీపీ నేతల మోసానికి ఆత్మహత్య చేసుకున్న పాల సుబ్బారావు కుటుంబీకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న లోకేశ్

మంగళగిరి, మార్చి 24: గత ఎన్నికల్లో తాను ఓటమి చెందినా మంగళగిరి ప్రజల హృదయాలను గెలుచుకోవాలనే పట్టుదలతోనే నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని సేవలు అందిస్తున్నట్లు టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం తాడేపల్లి వజ్ర రెసిడెన్సీవాసులను బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్ కార్యక్రమంలో కలుసుకున్నారు. పాత 23వ వార్డు అంబేద్కర్ సెంటర్, తాడేపల్లి నులకపేట, క్వారీ ప్రాంతాల్లో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ రాబోయే ఇరవై ఏళ్లకు సరిపడా మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా మంగళగిరి అభివృద్ధికి ప్రణాళికతో తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బ్లాక్ డెవలప్‌మెంట్ మోడల్ కింద అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడతామన్నారు. ఎన్నికలకు స్థానికంగా అవాంతరాలను సృష్టించడం ద్వారా పోలింగ్ ప్రక్రియను కొంత జాప్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పెంచిన పన్నుల భారాన్ని తగ్గించేందుకు చర్యలను తీసుకుంటామన్నారు. 30వేలమందికిపైగా స్వర్ణకారుల కోసం ప్రత్యేక సెజ్, చేనేత, ఆటోనగర్ అభివృద్ధి చేస్తామన్నారు.

అరాచకాలకు అడ్డాగా ఏపీ

వైసీపీ హయాంలో గంజాయి, డ్రగ్స్‌కు రాష్ట్రం కేరాఫ్ అడ్రస్‌గా మారిందని లోకేశ్ తెలిపారు. వేల కుటుంబాల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ఈ దందాకు రాగల వందరోజుల్లో చెక్ పెట్టేస్తామన్నారు. జగన్ నివాసానికి చేరువలోనే గంజాయి మత్తులో ఓ వ్యక్తిని హత్యచేసినా పట్టించుకున్నవారే లేరన్నారు. ఈ పరిస్థితులను సమూలంగా మార్చేసి రాష్ట్రంలో శాంతిభద్రతలను తిరిగి గాడిలో పెడతామని చెప్పారు.

ప్రజాభిమానం కొద్దే రాజకీయాల్లోకి:

కేవలం డబ్బుకోసమే అయితే తనకు రాజకీయాల్లోకి రావల్సిన అవసరం లేదని లోకేశ్ చెప్పారు. తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదివి వరల్డ్‌బ్యాంకులో ఉద్యోగం చేశానన్నారు. హెరిటేజ్ ఈడీగా పనిచేసిన రోజుల్లో రూ.కోట్లుగా ఉన్న టర్నోవర్‌ను రూ.1500 కోట్లకు పెంచగలిగానన్నారు. అనునిత్యం రాష్ట్రం కోసం తపనపడే చంద్రబాబుపై తప్పుడు ఆరోపణలు మోపి 53 రోజులపాటు జైలుకు పంపినపుడు ఈ రాజకీయాలు మనకు అవసరమా? అని తన భార్య బ్రాహ్మణి తనను అడిగిందన్నారు. అదే సమయంలో చంద్రబాబు అరెస్టు దరిమిలా ప్రపంచవ్యాపితంగా వచ్చిన స్పందన చూశాక ప్రజలు మావెంటే ఉన్నారని తమకు స్పష్టంగా అర్థమైందన్నారు.

అణగారిన వర్గాల ఉసురు పోసుకున్న జగన్

రచ్చబండ కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాంలో ఎక్కువగా నష్టపోయింది, వేధింపులకు గురైంది దళితులు, బీసీలు, మైనారిటీలేనన్నారు. జగన్ పాలనలో ఎస్సీ, బీసీ, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. కడప జిల్లాలో చేనేత కుటుంబం ఆత్మహత్యకు పాల్పడడానికి వైసీపీ నేతలే కారణమన్నారు. దళిత డ్రైవర్‌ను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును జగన్‌రెడ్డి తనపక్కనే కూర్చోబెట్టుకుని సమీక్షలు చేస్తూ ప్రజలకు ఏమి సంకేతాలను ఇస్తున్నారని ప్రశ్నించారు. తాను గత ఎన్నికల్లో ఓటమి చెందినా ఇక్కడే ఉంటూ నియోజకవర్గ ప్రజలకోసం 29రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలుచేశానన్నారు. రెండుసార్లు గెలిచిన ఆళ్ల తాడేపల్లిలో జగన్ నివాసం వద్ద పేదవాళ్లు ఉండరాదంటూ వారి ఇళ్లను కూల్చివేయించారన్నారు. ఎన్నికల నిబంధనల పేరుతో పోలీసులు తనను లక్ష్యంగా చేసుకుని ఇబ్బదులు పెడుతున్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ముఖ్యమంత్రి జగన్ వాహనాలను తనిఖీలు చేసి ఉంటే పోలీసులకు గంజాయైనా దొరికుండేదన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ రాక్షసపాలన కారణంగానే మంగళగిరి ప్రాంతం నాశనమైపోయిందన్నారు. వైసీపీ నేతల మోసం కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన రాజంపేట కొత్త మాధవరానికి చెందిన పాల సుబ్బారావు, పద్మావతి, వారి కుమార్తె వినయలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేతలు నందం అబద్దయ్య, దామర్ల రాజు, మన్నెం రమేష్‌బాబు, తోట పార్థసారథి, జగ్గారపు రాము, మద్దిరాల రమేష్, జనసేన నేతలు మునగపాటి వెంకట మారుతీరావు, జంజనం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

పార్టీలో చేరిన వారికి న్యాయం చేస్తాం

సత్తెనపల్లి, మార్చి24: వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చేవారికి న్యాయం చేస్తామని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రైవేటు హోటల్లో ఆదివారం రాజుపాలెం మాజీ జడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, సీనియర్ న్యాయవాది మర్రి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న కన్నా మాట్లాడుతూ పెన్నా గోదావరి నదుల అనుసధానం పనులను ఈ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. దీనివలన ఎంతో ప్రజాధనం దుర్వినియోగం అయిందన్నారు. స్థానిక మంత్రి రైతుల గురించి ఎప్పుడు పట్టించుకోలేదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ పార్టీలోకి వచ్చే కొత్తవారిని స్వాగతించి పార్టీ పరంగా న్యాయం చేస్తామన్నారు. వైసీపీని వీడి తమకు మద్దతు తెలిపిన మర్రి వెంకట్రామిరెడ్డి, సుబ్బారెడ్డి, మదమంచి రాంబాబు, కుశెలరావు, తదితరులను కన్నా, లావు కృష్ణదేవరాయులు అభినందించారు. కార్యక్రమంలో మర్రి వెంకట్రామిరెడ్డి, సుబ్బారెడ్డిలు కన్నా, లావులను పూలమాలలతో సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో తమందరం ఐక్యంగా కన్నా, లావుల విజయానికి కృషి చేస్తామని వైసీపీని వీడిన నేతలు తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో అంబటి వలన పడ్డ ఇబ్బందులను వెంకట్రామిరెడ్డి, రాంబాబులు వివరించారు. సత్తెనపల్లి నియోజవర్గంలో కన్నా, పార్లమెంటు ఎంపీ లావుల విజయానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎం.బార్ధనందరెడ్డి, నాయకులు పల్లపాటి పెద్దిరాజు, ఆళ్ల అమరేశ్వరరావు, పూజల వెంకటకోటయ్య, కొమటమనేని శ్రీనివాసరావు, శనగపూల నరసింహరావు, అనుమోలు జయరావు, నర్రా బాబురావు, అలా సుబ్బారెడ్డి, నాగుల్‌మీరా, సయ్యద్ మాబు, బొక్క సంగీతరావు, జి.ప్రభాకర్, గుత్తా వెంకట్రావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.



చెక్‌పోస్టుల్లో సీటీ శాఖ జేసీ తనిఖీలు

పొందుగల చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న జేసీ నాగజ్యోతి

గుంటూరు, మార్చి 24: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను వాణిజ్యపన్నుల శాఖ గుంటూరు-2 జాయింట్ కమిషనర్ నాగజ్యోతి ఆదివారం తనిఖీలు చేశారు. పొందుగల, సత్రశాల, విజయపురిసౌత్‌ల వద్ద ఉన్న తనిఖీ కేంద్రాలను ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించారు. కోడ్ అమల్లో ఉన్న సందర్భంగా రాష్ట్రంలోకి అనధికారికంగా వచ్చే వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. వే బిల్లులు, ఇన్‌వాయిస్ బిల్లులను పక్కాగా తనిఖీలు చేయాలన్నారు. తనిఖీల్లో ఎక్కడా నిర్లక్ష్యం వద్దని, ఎక్కడైనా అనుమానాలుంటే వెంటనే వాహన లోడ్‌ను పూర్తిస్థాయిలో తనిఖీలు చేయాలని ఆదేశించారు.

రాజధాని కోసం 33వేల ఎకరాల భూములిచ్చాం

- 1559వ రోజుకు రైతుల ఆందోళనలు



బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలోని మహిళలు

తుళ్లూరు, మార్చి 24: రాష్ట్ర రాజధాని నిర్మాణ కోసం 33వేల ఎకరాల భూములిచ్చామని, అందుకు ప్రతిఫలంగా సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులంటూ అమరావతిని నిర్వీర్యం చేసి గొప్పపని చేశాడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1559వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడారు. అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ఉంటుందని స్పష్టంచేశారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా అమరావతిని అంగుళం కూడా కదపలేరన్నారు. రాజధాని కోసం తాము భూములిస్తే.. వైసీపీ నేతలు రాష్ట్రంలో వేల ఎకరాలు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర రాజధాని అమరావతిని అభివృద్ధి చేయమంటే చలనం లేదన్నారు. హైకోర్టు తీర్పును కూడా ఉల్లంగించారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతిని కొనసాగించాలని రైతులు ఆందోళనలు వ్యక్తం చేశారు.

టీడీపీ కార్యకర్తపై దాడి హేయం

- మాజీ మంత్రి ఆనందబాబు



వైసీపీ ఎంపీటీసీ దాడి చేసిన టీడీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

కొల్లూరు, మార్చి 24: వైసీపీ జెండాలు తొలగించలేదని ప్రశ్నించిన తమ కార్యకర్తపై వైసీపీ మూకలు దాడి చేయడం హేయమైన చర్యని మాజీ మంత్రి, వేమూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని కిష్కిందపాలెంలో శనివారం గ్రామ వైసీపీ ఎంపీటీసీ తదితరులు దాడి చేసి గాయపరిచిన తమ కార్యకర్త కొల్లి వెంకటేశ్వరరావును మాజీ మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియామవళిలో భాగంగా అధికారులు అన్ని రాజకీయ పార్టీల జెండాలను తొలగించాల్సి ఉండగా, కేవలం టీడీపీ జెండాలనే తొలగించడంతో తమ కార్యకర్త వైసీపీ జెండాలు ఎందుకు తొలగించలేదని ప్రశ్నించడంతో వైసీపీ ఎంపీటీసీ, సర్పంచ్, కార్యకర్తలు తమ కార్యకర్తపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడం వారి రౌడీయిజానికి నిదర్శనమన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు అధైర్యపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆపై తాము చూసుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ భూదాహానికి ప్రజలు బలి

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 24: రాష్ట్రంలో జగన్ భూదాహానికి అమాయక ప్రజలు బలై పోతున్నారని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో ఒకే కుటుంబానికి ముగ్గురి ఆత్మహత్యలే ఇందుకు నిదర్శనం అన్నారు. ఈ హత్యలను జగన్ ప్రభుత్వం హత్యలు గానే భావించాలన్నారు. అధికార పార్టీ భూ కబ్జాల కోసం రెవెన్యూ రికార్డులను తారుమారు చేస్తూ బడుగుల జీవితాలతో చెలగాట మాడుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆస్తులు ఎలా అన్యాక్రాంతం అవుతున్నాయో చెప్పే దానికి ఇదో ఉదాహరణ అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల నుంచి ఇదే పనిలో ఉన్నారని, ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చి వేల ఎకరాల పేదల భూములు కొట్టేస్తున్నారని తాము మొదటి నుంచి చెపుతూనే ఉన్నామని గుర్తు చేశారు. ఇటీవల తెచ్చుకున్న ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా ఆ కుయుక్తులకు మరింత పదును పెట్టారన్నారు. ఈ చట్టంతో ప్రజల ఆస్థి హక్కులకు విఘాతం కలిగేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనానికి ముఖ్యంగా పేదలు, ఆర్థికంగా బలహీన వర్గాల వారికి విదరుద్ధంగా ఉన్న ఈ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు.

తనిఖీల్లో రూ.2.79 లక్షలు స్వాధీనం

తాడికొండ, మార్చి 24: తాడికొండ అడ్డరోడ్డు చెక్ పోస్టు వద్ద ఆదివారం ఓ కారును తనిఖీలు చేయగా రూ.2,79,290 గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గుంటూరుకు చెందిన ఆంద్ర శ్రీనివాసరావు కారులో గుంటూరు నుంచి పెదకూరపాడు మండలం గారపాడు వెళ్తున్నాడు. తుళ్లూరు ఎస్.ఐ వేణుగోపాల్ తన సిబ్బందితో కారును తనిఖీలు చేశారు. స్వాధీనం చేసుకున్న నగదును ట్రెజరీకి పంపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

జేఎంజే వద్ద పోలీసుల సోదాలు.. రూ.లక్ష స్వాధీనం

తెనాలి, మారీసుపేట మార్చి 24: పట్టణంలో జేఎంజే కళాశాల వద్ద ఆదివారం వానాలను తనిఖీలు నిర్వహిస్తుండగా గుంటూరు నుంచి తెనాలి వస్తున్న ఒక కారులో ఎటువంటి రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అందజేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాపులకు అండగా ఉంటా

- ఆత్మీయ సమావేశంలో యరపతినేని



మాట్లాడుతున్న గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 24: తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో కాపు సామాజికవర్గ నేతలు ఎందరో తనకు అండగా వున్నారని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక కల్యాణ మండపంలో కాపు సామాజికవర్గ నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ హయాంలో ఆటోనగర్ స్థలాల్లో కాపు సామాజికవర్గానికి చెందిన కొందరికి కేటాయించిన ప్లాట్లను వైసీపీ పాలనలో రద్దు చేయడంతో పాటు అనేక ఇబ్బందులు పడిన విషయాన్ని పలువురు కాపు సామాజికవర్గ నేతలు యరపతినేని దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ రాష్ట్రాన్ని సైకో పాలన నుంచి రక్షించేందుకు చంద్రబాబుకు తోడుగా వున్న పవన్‌కల్యాణ్‌ను రాష్ట్ర ప్రజలు అభినందిస్తున్నారని యరపతినేని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాపు రిజర్వేషన్, కాపు భవన్ నిర్మించిన విషయాన్ని గుర్తుచేస్తూ పదవుల కేటాయింపులోనూ తగిన ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. వైసీపీ హయాంలో కాపులకు జరిగిన అన్యాయాన్ని వివరించడంతో పాటు దాచేపల్లి మండలంలో తనకు ఎంతో అండగా వున్న పురంశెట్టి అంకులును కూడా వైసీపీ నేతలు పొట్టన పెట్టుకున్న విషయాన్ని గుర్తుచేశారు. రేపటి ఎన్నికల తరువాత ఏర్పడే ప్రజాప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికలలో వార్డు సభ్యులు, సర్పంచ్, కౌన్సిలర్ల పదవులన్నింటా కాపులకు తగిన ప్రాధాన్యం ఇస్తానని భరోసా ఇచ్చారు. పిడుగురాళ్లలో కాపు సామాజికవర్గానికి చెందిన శ్మశాన స్థలం కేటాయింపు, ఆటోనగర్‌లో రద్దు చేసిన ప్లాట్లను తిరిగి కేటాయించడంతో పాటు యూత్‌పాలసీ కింద యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు ఆర్థిక భరోసా, సామాజిక అభివృద్ధికి తానెప్పుడూ అండగా వుంటున్న విషయాన్ని వివరించారు. ఈ సందర్భంగా యరపతినేనిని పలువురు కాపు సంఘీయులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో దేశినేని మోహన్‌రావు, గోపిదేశి సాంబశివరావు, మల్లెంశెట్టి లక్ష్మణరావు, బశ్వల చంద్రశేఖర్, ఆముదాల గంగయ్య, దేశినేని రాంబాబు, కామిశెట్టి రమేష్, రేళ్ల కోటేశ్వరరావు, దామిశెట్టి నాగేశ్వరరావు, రామిశెట్టి చంద్రశేఖర్, కామిశెట్టి అమరలింగేశ్వరరావు, గుర్రం రామకోటేశ్వరరావు, లేళ్ల ప్రసాద్, కొమిరిశెట్టి రామచంద్రయ్య, మెండు బాలసుబ్రహ్మణ్యం, బేతంచర్ల కోటిమేస్త్రి, ఆముదాల చినగంగయ్య, కొమ్మా మహేష్, నెకరికంటి శివ, నూతి సూరి, రమాదేవి, మునగా వెంకట్, మణికంఠ రాము, రామిశెట్టి మధు, తదితరులు పాల్గొన్నారు.

యార్డులో అసోసియేషన్ల కార్యాలయాలు మూసివేత



మిర్చియార్డు ఆవరణలో కార్మిక సంఘాల కార్యాలయాలకు సీలు వేయిస్తున్న మార్కెట్ కమిటీ అధికారులు

గుంటూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో వైసీపీ నేతలతో సమావేశాలు ఏర్పాటు చేసినందుకు వివిధ కార్మిక, వ్యాపారుల సంఘాల కార్యాలయాన్నింటికి సీలు వేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతి సంచికలో వైసీపీతో... వేమెన్‌లు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు స్పందించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి వైసీపీ నేతలతో వేమెన్‌ల సంఘం సమావేశం నిర్వహించినందుకు నోటీసులు జారీ చేయించారు. అలానే యార్డు ఆవరణలో ఉన్న వేమెన్ అసోసియేషన్లు, హమాలీ, దొడ్డికాపలా, గుమాస్తాలు, మిర్చి ఎక్స్‌పోర్టర్స్ తదితర సంఘాల కార్యాలయాన్నింటికీ యార్డు సెక్రెటరీలను పంపించి తాళం వేయించారు. ఎన్నికల కోడ్ ముగిసేవరకు వాటిని తెరవరాదని ఆదేశించారు. అలానే ఎవరైతే వేమెన్‌లు వైసీపీ నేతలతో సమావేశం పెట్టారో వారికి నోటీసులు జారీచేయాలని నిర్ణయించారు. నోటీసులకు ఇచ్చే సమాధానాల ఆధారంగా చర్యలు తీసుకొంటామని జేడీ తెలిపారు.

యార్డులో రాజకీయ సమావేశాలకు తావు లేదు: మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చియార్డులో ఎలాంటి రాజకీయ సమావేశాలకు తావులేదని మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మిర్చియార్డు అనేది ప్రభుత్వసంస్థ అని, యార్డు ప్రాంగణంలోని కమీషన్ దుకాణాల్లో రాజకీయ నాయకులు ఫోటోలు, ఫ్లెక్సీలు, పార్టీల జెండాలు ఏర్పాటుచేయరాదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులౌతారని హెచ్చరించారు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి



మహాలక్ష్మమ్మ మృతదేహం

దాచేపల్లి, మార్చి24: వేగంగా ప్రయాణిస్తున్న లారీ రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం దాచేపల్లిలోని కారంపూడి బస్టాండ్ వద్ద జరిగింది. మృతురాలు కారంపూడి మండలం బట్టువారిపల్లె గ్రామానికి చెందిన సరికొండ మహాలక్ష్మమ్మ(57)గా గుర్తించారు. మృతురాలు మహాలక్ష్మమ్మ మిర్యాలగూడలో తన కొడుకు వద్దకు వెళ్లి తిరిగి స్వగ్రామమైన భట్టువారిపల్లె వెళ్లేందుకు బస్సులో మిర్యాలగూడ నుంచి దాచేపల్లి చేరుకుంది. బస్సును ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ వేగంగా వచ్చి మహాలక్ష్మమ్మను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. దాచేపల్లి ఎస్‌ఐ సంధ్యారాణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

మాచర్లరూరల్, మార్చి 24: బైకు అదుపుతప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని 24వ వార్డుకు చెందిన షేక్ యాసిన్(30) ద్విచక్ర వాహనంపై తన స్నేహితునితో కలిసి మండాది నుంచి వస్తున్నారు. పట్టణ శివారులోకి రాగానే బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో యాసిన్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యాసిన్ మృతదేహం

ఆటో బోల్తా...విద్యార్థి మృతి



మృతిచెందిన విద్యార్థి రాకేష్

నాదెండ్ల, మార్చి 24: అదుపు తప్పిన ఆటో కాలువలోకి దూసుకువెళ్లటంతో ఇర్లపాడు గ్రామానికి చెందిన ఏటీ రాకేష్ (15) అనే విద్యార్థి మృతి చెందగా మరో ఇద్దరు గాయ పడ్డారు. ఈ సంఘటన ఎండుగుంపాలెం, నాదెండ్ల గ్రామాల మధ్య ఆదివారం జరిగింది. ఎస్‌ఐ బాల రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో జరిగే వివాహంలో చిరిబోయిన రాకేష్ సౌండ్ సిస్టమ్, విద్యుత్ అలంకరణ తదితరాలను ఏర్పాటు చేస్తున్నాడు. ఈ క్రమంలో నాదెండ్లలో డీజే సౌండ్ సిస్టమ్‌ను తీసుకు వచ్చేందుకు ఇర్లపాడు నుంచి ట్రక్ ఆటోలో గ్రామానికి చెందిన టీ కల్యాణ కుమార్, రాకేష్ బయలుదేరారు. ఎండుగుంపాలెం-నాదెండ్ల గ్రామాల మధ్య ఆటో అదుపుతప్పి కాలువలోకి దూసుకు వెళ్లింది. ఈ ఘటనలో ఏటీ రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన రాకేష్ ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నాడు. ప్రమాదంలో కళ్యాణ్ కుమార్‌తో పాటు సిరిబోయిన రాకేష్ కూడా గాయపడ్డాడు. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో రూ.7లక్షలు స్వాహా

రేపల్లె, మార్చి 24: ప్రభుత్వం మద్యం దుకాణాల్లో గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయాల్లో రూ.7లక్షలు సేల్స్‌మ్యాన్లు, సూపర్‌వైజర్లు దోచేసుకున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళటంతో ఆదివారం నగరం ప్రభుత్వం మద్యం దుకాణంలో ఏపీ బీసీఎల్ తెనాలి ఐఎన్‌ఎల్ డిపో ఎస్‌ఐ దివాకర్ విచారణ చేశారు. సుమారు రూ.7లక్షలకు పైనే సూపర్‌వైజర్ మహేష్, సేల్స్‌మ్యాన్ కోటిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డిలను విచారించారు. విషయాన్ని బయటకు పొక్కనివ్వకుండా స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులపై తీవ్రఒత్తిడి తీసుకువచ్చారు. సూపర్‌వైజరు, ముగ్గురు సేల్స్‌మ్యాన్‌లను కాపాడేందుకు అధికార పార్టీ నాయకులు విశ్వప్రయత్నం చేశారు. ఎన్నికల కోడ్ ఉండటంతో అధికారులు ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళిందని మేము ఏమీ చెయ్యలేమంటూ అధికారులు తెలుపుతున్నారని స్థానిక నాయకులే బాహాటంగా చెప్పుకుంటున్నారు. ఎస్‌ఐ దివాకర్‌ను వివరణ కోరగా అవకతవకలు జరిగిన మాట వాస్తవమేనని వీరి నలుగురిని బాపట్ల ఐఎంఎల్ డిప్యూటీ మేనేజర్ అరుణకుమారి వద్దకు తీసుకుని వెళ్ళామని తెలిపారు. వీరి వద్ద నుంచి అవకతవకలు జరిగిన నగదును రికవరీ చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00



రచయితలను సన్మానిస్తున్న సాహితిభారతి రచయితలు

ప్రపంచాన్ని నేడు అక్షరం శాసిస్తుంది

● సాహితి భారతి అధ్యక్షుడు రావూరి

బాపట్లటౌన్, మార్చి 24 : ప్రపంచాన్ని నేడు అక్షరం శాసిస్తుందని అక్షరం రానిదే రక్షణ కరువవుతుందని వర్ధమాన రచయిత వెంకుసనాతన, సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మలు సంయుక్తంగా తెలిపారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సాహితిభారతి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ కవిత దినోత్సవ వారోత్సవాలలో భాగంగా జరిగిన సమావేశంలో వెంకుసనాతన ముఖ్య వక్తగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సభలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, సాహితిభారతి ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, సాహితిభారతి కార్యదర్శి కస్తూరి శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అందరికి అర్థమయ్యే తెలుగు భాషలో వచన కవిత్వం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయితలు బందా సుందర దుర్గాప్రసాద్, ఎంవీఎల్ ప్రసాద్, వెంకుసనాతన, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్‌లను సాహితి భారతి రచయితలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ కార్యదర్శి జేవీ కృష్ణారావు, పద్య గాయకుడు డి.ధర్మారావు, వెంకట్రావు, ఎన్‌వీ కృష్ణ, కె.సుబ్బారావు, గుప్తా తదితరులు పాల్గొన్నారు

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

బాపట్ల, మార్చి 24 : జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో ఈనెల 28వ తేదీన బార్ అసోసియేషన్ ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారి బెజ్జం వెంకటేశ్వర్లు తెలిపారు. 2024 -2025కు సంబంధించి అధ్యక్ష పదవికి ఎన్‌వీఎస్‌ఎన్‌ఎస్ ప్రసాదరావు, సి.రవికుమార్, విన్నకోట సత్యప్రసాద్‌లు పోటీలో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే జనరల్ సెక్రటరీగా లంబు సాంబయ్య, ఇమ్మడిశెట్టి సతీష్ పోటీలో ఉన్నట్లు చెప్పారు. ఉపాధ్యక్షుడిగా జి.సువర్ణనాగమోహిని, జాయింట్ సెక్రటరీగా కట్టా కోర్నేలియా, కోశాధికారిగా ఏటి నతరాజన్, లైబ్రరీ సెక్రటరీగా సి.ప్రేమచంద్, లేడి రిప్రజెంటిటీవ్‌గా కె.నాగలక్ష్మి ఏకగ్రీవం అయినట్లు తెలిపారు. న్యాయవాదులు రాష్ట్ర బార్ కౌన్సిల్ జారీ చేసిన గుర్తింపు కార్డు తీసుకొని ఎన్నికలకు హాజరుకావాలన్నారు. ఎన్నికల సహాయకులుగా గోనా కిషోర్, అంకిశెట్టి మాధురి వ్యవహరిస్తారన్నారు.

సూర్యలంక తీరంలో పర్యాటకుల సందడి

బాపట్ల, మార్చి 24 : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకుల సందడి పెరిగింది. విద్యార్థులకు పరీక్షల సమయం ముగియటం, వేసవితీవ్రత అధికంగా ఉండటంతో సేదతీరేందుకు కుటుంబ సభ్యులతో కలిసి తీరానికి వస్తున్నారు. బాపట్ల పరిసరప్రాంతాలు నుంచే కాకుండా దూరప్రాంతాలు నుంచి కూడా పర్యాటకులు ప్రత్యేక వాహనాలలో వచ్చి ఇక్కడ సందడి చేస్తున్నారు. సముద్రస్నానాలు చేస్తూ ఇసుకతో బొమ్మలు చేస్తూ సంతోషంగా, సరదాగా గడుపుతున్నారు. పర్యాటకులకు తగినన్ని వసతులు కల్పించటంలో పాలకులు విఫలమయ్యారు. నీడనిచ్చే షెల్టర్‌లు కూడా తొలిగించారు. అయినప్పటికి పర్యాటకులు సరదాగా గడిపేందుకు పెద్దసంఖ్యలో వస్తున్నారు. సెలువులు రావటం వల్ల ఇకపై తీరానికి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.



సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు చేస్తూ సందడి చేస్తున్న పర్యాటకులు

ఘనంగా నాగదేవతా హోమం

బాపట్ల, మార్చి 24 : మండలంలోని మహర్షి ఆశ్రమ గోశాలలో ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఆదివారం నాగదేవత హోమం జరిపారు. నవనాగసహిత మానసాదేవికి నాగదండంను సమర్పించారు. భూ సమస్యలు, రోగసమస్యలు, శత్రుబాధలు, నాగదోషాలు, పితృదోషాలు, మాంగల్య దోషాలు తొలగిపోవాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంపత్‌గణపతిపరివార్ సభ్యులు బి.బాబునాగేంద్ర తెలిపారు. కార్యక్రమంలో బీఎస్ నారాయణభట్టు, మామిడి రాజశేఖర్, అశోక్‌కుమార్, మలిశెట్టి భ్రమరాంబ, యామిని పద్మజ, కె.రామతులసీ, కొమ్మినేని శ్రీనివాసరావు, పద్మజ, శ్రీనివాసరావు, జ్యోతిర్మయి. నాగలక్ష్మి, నారాయణ, శ్రీరామ పారాయణ సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణమహోత్సవం

బాపట్ల, మార్చి 24 : శ్రీలలిత త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు ఆధ్వర్యంలో చీలురోడ్డుసెంటర్‌లోని శ్రీపాండురంగస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. అదేవిధంగా సామూహిక సౌభాగ్యప్రద లక్ష్మీకుబేర కుంకుమార్చన జరిపారు. మేడూరి వెంకటఅప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, పరచరం రఘురామాచార్యులు యాజ్ఞికంలో శాస్త్రోక్తంగా జరిగింది.



కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు హనుమంతరావు, వెంకటఅప్పలాచార్యులు తదితరులు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సేల్స్‌మెన్ అరెస్టు

● 46 మద్యం బాటిల్స్ స్వాధీనం

బాపట్ల, మార్చి 24 : బాపట్ల మండలం భర్తీపూడి గ్రామంలోని మద్యం దుకాణంలో మద్యం బాటిల్స్ తరలిస్తుండగా సెబ్ అధికారులు పట్టుకున్నారు. సెబ్ సీఐ యువి వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. భర్తీపూడి వైన్‌షాపులో పని చేస్తున్న సీహెచ్ కోటేశ్వరరావు ఈనెల 17న టీవీఎస్ వాహనంపై 41 మద్యం బాటిల్స్ తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. దీంతో అతనిని విధులు నుంచి తొలిగించి కాకుమాను నాగపూర్ణచందును నియమించారు. పూర్ణచందు శనివారం రాత్రి వాచ్‌మన్ శివయ్య, మరొక వ్యక్తితో కలిసి 46 మద్యం బాటిల్స్‌ను బైకపై తీసుకెళుతుండగా డీటీఎఫ్ టీమ్, సెబ్ సిబ్బందితో కలిసి పూర్ణచందు, శివయ్యను పట్టుకున్నట్లు తెలిపారు. మరో వ్యక్తి పరారైనట్లు చెప్పారు. దీంతో మద్యం బాటిల్స్, బైక్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఒక వ్యక్తి వద్ద 3 మద్యం బాటిల్స్ కన్నా ఎక్కువ ఉంటే, ఇతర ప్రాంతాలకు చెందిన మద్యం ఒక బాటిల్ ఉన్నా కేసు నమోదు చేస్తామని సెబ్ సీఐ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఇసుక టిప్పర్

కర్లపాలెం, మార్చి 24 : కర్లపాలెం మండలంలోని బుద్దాం సమీపంలో ఉన్న తుంగభద్ర వంతెనపై ఆగి ఉన్న లారీని ఇసుకలోడ్‌తో వస్తున్న టిప్పర్ శనివారం రాత్రి ఢీకొంది. లారీలో, లారీ సమీపంలో ఎవరు లేని కారణంగా ఎలాంటి ప్రమాదం జరగలేదు. లారీ ప్రమాదం జరగటానికి కారణం అతి వేగమేనని స్థానికులు తెలియజేస్తున్నారు. టిప్పర్లతో ఇసుక తరలించే వారు అధికలోడ్‌తో వేగంగా ప్రయాణం చేస్తుండటంతో రహదారులపై ప్రయాణించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. పోలీసు యంత్రాంగం అప్రమత్తమై అధిక లోడు, అతివేగంగా టిప్పర్లు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజానీకం కోరుతున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

కర్లపాలెం, మార్చి 24 : కర్లపాలెం పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని మరో ద్విచక్రవాహనం ఆదివారం ఢీకొంది. ఈ ఘటనలో తెనాలి ఐతానగర్‌కు చెందిన యువకులకు గాయాలయ్యాయి. వారిని ఆటోలో స్థానికులు బాపట్ల వైద్యశాలకు తరలించారు.

చంద్రబాబుతోనే యువతకు భవిష్యత్తు

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ



నూతన ఓటర్లకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 24 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. కర్లపాలెం మండలంలోని ఎం.వి.రాజుపాలెం గ్రామానికి చెందిన మైనార్టీ యువత 20 మంది నూతన ఓటర్లు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి నరేంద్రవర్మ పార్టీలోకి ఆహ్వానించారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేసి పని చేస్తామన్నారు. సయ్యద్ షబీర్, సయ్యద్ సోహేల్, సయ్యద్ అలియాజ్, షేక్ సోహేల్, షేక్ ఇమామ్ ఆలి, పఠాన్‌బాజి, షేక్ రియాజ్, షేక్ మహబూబ్ సుభానీ, షేక్ సల్మాన్, షేక్ అక్రమ్, షేక్ అఫ్రోజ్, షేక్ వాసిఫ్, షేక్ నాగూర్, షేక్ మొహిద్దీన్, షేక్ ఇలియాజ్, షేక్ జాన్ సైదా, షేక్ జానీ, షేక్ ఖాజా, సయ్యద్ జానీ బాషా, షేక్ అఫ్రోజ్ పార్టీలో చేరారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల,మార్చి 24 : మండలంలోని వెదుళ్ళపల్లి అక్సప ఏమసీద్‌లో ముస్లిం యూత్, మసీదు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందు విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, తెలుగుదేశం పార్టీ నాయకులు ముక్కామల శివ, గుడిపల్లి సాంబయ్య, ఫరీద్, మీరావలి, చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

వాడవాడలా ఘనంగా మట్టల ఆదివారం



బాపట్ల, మార్చి 24 : పట్టణంలోని విద్యానగర్ రక్షణసైన్యం చర్చి కోర్ ఆఫీసర్ డి.ఏబు, జ్యోతిల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఈతమట్టలకు పూలు అలంకరించి పురవీధులలో నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కోర్ ఆఫీసర్ ఏబు మాట్లాడుతూ ప్రపంచమంతా మట్టల ఆదివారం వేడుకలను సంతోషంగా జరుపుకుంటారని తెలిపారు. సంఘపెద్దలు జీఏ మణిభూషణ్, మేడి చక్రవరి, బోడా షరూర్ చంద్ర, విజయ్‌కుమార్, కొండ్రు కరుణాకర్, సంఘపెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

సీబీజెడ్ చర్చి ఆధ్వర్యంలో...

బాపట్ల,మార్చి 24 : పట్టణంలోని ప్రసిద్దిగాంచిన సీబీజెడ్ చర్చి ఆవరణలో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్వమానవాళి పాపపరిహారం నిమిత్తం తన పవిత్రమైన రక్తం చిందించుటకు ఏసుప్రభువు యేరుషలేం లోనికి జయప్రవేశం చేసిన సుదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎం.పవిత్రకుమార్, డీఎం రాహుల్‌దేవ్, కెజివి శుభకర్‌లు తెలిపారు. చిన్నారులు ఈతమట్టలను పూలతో అలంకరించి నినాదాలు చేస్తూ పురవీధులలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సండేస్కూల్ టీచర్స్ కమిటీ సభ్యులు, స్త్రీల సమాజం వారు, సంఘసెక్రటరి జె.క్రిష్టఫార్, ఇన్‌చార్జి సెక్రటరి టి.ప్రేమచంద్, కోశాధికారి ఎ.ప్రసన్నకుమార్, జాయింట్ సెక్రటరి జె.ఏలీషారావు, జె.డానియేలు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం మండలంలో...

పిట్టలవానిపాలెం, మార్చి24 : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలోని చర్చిలలో పాస్టర్‌లు, దైవజనుల ఆధ్వర్యంలో ఆదివారం మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని చందోలు పెదహరిజనవాడ చర్చిలో సంఘకాపరి జి.మోహనరావు ఆధ్వర్యంలో ఈతమట్టలను పూలతో అలంకరించి ప్రార్ధనలు చేస్తూ శాంతి ర్యాలీని చేపట్టారు. ఆయా ప్రార్ధనా మందిరాలలో ప్రత్యేక ఆరాధనలు చేపట్టారు. చిన్నారులకు సంఘకాపరులు మట్టల ఆదివారం విశిష్ఠత గురించి తెలియజేశారు. క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరులు, దైవజనులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం, మార్చి 24 : మండల కేంద్రమైన కర్లపాలెం పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ బేతస్థ చర్చి, దాస్‌నగర్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం మట్టల పండుగను చిన్నారులతో కలిసి పాస్టర్‌లు భక్తిగీతాలు ఆలపిస్తూ ఘనంగా నిర్వహించారు. కిషోర్‌బాబు, కృపావరం ఆధ్వర్యంలో చిన్నారులు ఈతమట్టలకు పలు రకాల పూలు ప్రత్యేక అలంకరణ చేసి కర్లపాలెం పురవీధులలో ఏసుగీతాలు ఆలపిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పురవీధులలో క్రైస్తవ భక్తిగీతాలు ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహించారు.

వేమూరులో...

వేమూరు, మార్చి 24 : మండల పరిధి గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం మట్టల ఆదివారం పండుగను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం క్రైస్తవ చిన్నారులు రంగు రంగు పూలతో అలంకరించిన ఈతమట్టలను చేతుల్లో ధరించి వీధుల్లో క్రీస్తు గీతాలు ఆలపిస్తూ ఊరేగింపు జరిపారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అన్నదానలు జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పాస్టర్లు తమ ప్రసంగాలలో పండుగ విశిష్టతను వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు

వైసీపీ నేత భూదాహానికి చేనేత కుటుంబం బలి

● టీడీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు

రేపల్లె, మార్చి 24 : వైసీపీ నేతల భూకబ్జాలకు ముఖ్యమంత్రి జగన్ రెడ్డి సొంత జిల్లా కడపలో ఓ బీసీ కుటుంబం బలైందని, అధికారం అండతో కబ్జాలకు పాల్పడుతున్న వైసీపీ మూకలతోను అన్ని విలువలు వదిలేసి వారికి సహకరించిన రెవెన్యూ అధికారులు చేసిన గొప్పల కుటుంబం మొత్తం ఆత్మహత్యలకు పాల్పడిందని దీనిపై జగన్ ఏం సమాధానం చెబుతారంటూ టీడీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు విమర్శించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతోను పోరాడే శక్తి లేక న్యాయం జరుగుతుందనే ఆశ కనుచూపు మేరలో కనిపించక వైసీపీ నాయకుల దౌర్జన్యానికి చేనేత విభాగానికి చెందిన పాలా సుబ్బారావు కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుందన్నారు. దీనికి కారణమైన వైసీపీ నేతలు, రెవెన్యూ అధికారులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రం మొత్తం తాకట్టు పెట్టే పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమావేశంలో దివి రాంబాబు, ఉప్పాల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, మార్చి 24: వైసీపీ నేత భూదాహానికి చేనేత కుటుంబం బలి అయ్యిందని, చేనేత కుటుంబానికి ఉన్న భూమిని అక్రమంగా తమ పేర్ల మార్చుకోవడం విచారకరమని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు దివి రాంబాబు ఆవేదన చెందారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఒకే కుటుంబంలో తండ్రి, తల్లి, కుమార్తెలు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. అధికారులు వైసీపీకి తొత్తులుగా మారి చేనేత కుటుంబానికి చెందిన భూమిని వేరొకరికి ఆన్‌లైన్ చేశారని విమర్శించారు. భూమార్పిడి చేసుకున్న నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, టీడీపీ నాయకులు ఎంఆర్‌కే మూర్తి, శొంఠి కోటయ్య, సుధాకర్, ఊరగంటి శివనాగేంద్రం, విస్సంశెట్టి శ్రీనివాసరావు, రామారావు, చేనేత సంఘ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, దివి శ్రీనివాసరావు, పలు గ్రామాల చేనేత సంఘ నాయకులు పాల్గొన్నారు.



చెరుకుపల్లి నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ప్రదర్శన

● భట్టిప్రోలు, మార్చి 24 : చేనేత కార్మిక కుటుంబం ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులను, భూ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మృతి చెందిన సుబ్బారావు కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించి ఆత్మహత్యకు కారకులైన అధికారులను, భూమి కబ్జా చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బాలాజీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు, జి. లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో డాక్టర్ అఖిలేశ్

వేమూరు, మార్చి 24 : వేమూరు అసెంబ్లీ అభ్యర్థి నక్కా ఆనంద బాబు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన కుమారుడు డాక్టర్ అఖిలేశ్ ఆదివారం జంప నిలో రెండవ రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల ను కలిసి నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో ఉన్న తన తండ్రికి ఓటు వేసి విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. చంద్రబాబు పాలన వస్తేనే రాష్ట్రానికి, ప్రజలకు మంచి జరుగుతుందని వివరించారు. ప్రధానమైన ఆ అంశాలతో కూడిన మ్యానిఫెస్టో కరపత్రాలను స్వయంగా పంపిణీ చేశారు.ప్రచారం కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ, నాంచారమ్మ తిరునాళ్ల

కొల్లూరు, మార్చి 24: లక్ష్మీతిరుపతమ్మ, నాంచారమ్మ తల్లి తిరునాళ్ల ఘనంగా జరిపారు. ఆదివారం మండల పరిధిలోని దోనేపూడిలోని గోపయ్యార సమేత లక్ష్మీతిరుపతమ్మ తల్లి, పెసర్లంకలోని నాంచారమ్మ తల్లి వార్షిక తిరునాళ్ల పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే భక్తులు అలయాలకు పోటెత్తారు. మూగజీవాలతో పాటు వాహనాలను అలయం చుట్టూ ప్రదక్షిణ లు చేశారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లను తయారు చేసి అమ్మవార్లను దర్శించి నివేదించారు. భక్తులు మూగజీవాలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రేపల్లె డీఎస్‌పీ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ రవీం ద్రా రెడ్డిలు బందోబస్తు పర్యవేక్షించారు.



దర్శనానికి బారులు తీరిన భక్తులు (అంతరచిత్రంలో గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ తల్లి)

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

బాపట్ల, మార్చి 24 : మండలంలోని అడవి గ్రామపంచాయతీ అడవిపల్లెపాలెం గ్రామంలో ఎస్‌టూ నీడి ఫౌండేషన్ నిర్వహిస్తున్న గ్రామీణ విద్యా కేంద్రం 5 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ ఫౌండేషన్ అధ్యక్షుడు తోట సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి తోట రమ్య పావని విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర సామగ్రి అందజేశారు. ఐదేళ్ళుగా సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జన్మభూమిపై మమకారంతో దివంగత తోట సురేంద్రబాబు దాతృత్వంతో ఫౌండేషన్ స్థాపించి సేవలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గోగు శివ, మల్లడి రత్నమ్మ, బొంది దేవుడు, చోడిపిల్లి అప్పారావు, ఎరిపిల్లి నూకరాజు, జామి సత్యారావు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు అండగా బీఎఫ్‌ఏ

భట్టిప్రోలు, మార్చి 24 : భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా ఆదివారం గ్రామంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులకు గొడుగులను అందజేశారు. గ్రామంలో వీధి వ్యాపారాలు నిర్వహించుకుంటున్న చిరువ్యాపారులు 12 మందికి అంబరిల్లా గొడుగులను బీఎఫ్‌ఏ సభ్యులు ఆదివారం పంపిణీ చేశారు. అదేవిధంగా భట్టిప్రోలు గ్రామంలో జరుగుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి రథోత్సవం పురస్కరించుకుని భక్తులకు 1200 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కె.సత్యనారాయణ, బి.జయబాబు, కె.శ్రీనాథ్, వినోద్, ఆదినారాయణ, బి. శ్రీని వాసరావు, వి.బాబూజీ, పి.శిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణమూర్తులైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కన్నుల పండువగా మల్లేశ్వరస్వామి దివ్య రథోత్సవం

● శివనామస్మరణతో మార్మోగిన భట్టిప్రోలు

భట్టిప్రోలు, మార్చి 24 : భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన దివ్య రథోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు రథంపై విహరిస్తున్న స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో రథోత్సవం జరిగే రహదారులు భక్తజన సంద్రంగా మారాయి. భట్టిప్రోలు గ్రామ నడిబొడ్డున ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన దివ్య రథోత్సవాన్ని అద్దేపల్లి, భట్టిప్రోలు పద్మశాలీయ సంఘీయులు వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని కల్యాణ మల్లేశ్వరుడిని దర్శించుకున్నారు. శనివారం అర్ధరాత్రి దేవాలయంలో ప్రారంభమైన స్వామి వారి కల్యాణ మహోత్సవం తెల్లవారుజామున ముగిసింది. శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి కల్యాణాన్ని వేద పండితులు కౌతా సత్య వెంకట నాగరాజేష్, దండిబొట్ల కనకసుందరశర్మలు వేద మంత్రోచ్చారణలతో మంగళవాయిద్యాల నడుమ జరిపించారు. అనంతరం ఆదివారం ఉదయం గ్రామ పురవీధుల్లో స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించి దేవాలయానికి చేర్చారు. రథోత్సవాన్ని సాయంత్రం శాస్త్రోక్తంగా ప్రారంభించగా భక్తులు రథానికి ఇరువైపులా ఉన్న మోకును చేతబూని హరహరా అంటూ ముందుకు లాగారు. స్వామివారి అత్త వారిల్లుగా పిలువబడే అద్దేపల్లిలోని అమ్మవారి చెట్టు వద్దకు రథాన్ని తీసుకెళ్ళి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా స్వామి వారి రథాన్ని రంగు రంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించి కల్యాణ మల్లేశ్వరుడిని రథంపై ప్రతిష్ఠించారు. మూడు గంటల పాటు సాగిన రథోత్సవంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని రథం మోకును తాకి నమస్కరించి తమ భక్తిని చాటుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐలు కె.శ్రీనివాసరావు, వై.సురేష్, తమసిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. దారి పొడవునా భక్తులకు తాగునీరు, మజ్జిగ, పులిహోర, స్వీటు ప్యాకెట్లను పలు స్వచ్ఛంద సంస్థలు పంపిణీ చేశాయి. అద్దేపల్లి, భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘీయులు, వంశపారంపర్య ధర్మకర్తలు, ఆలయ కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు రథోత్సవాన్ని పర్యవేక్షణ గావించారు.

రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యం

● ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, మార్చి 24: రాష్ట్రాభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. పలువురు నాయకులు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో రోజురోజుకు అరాచక పాలన పెరిగిపోయిందని, గంజాయి, మాదక ద్రవ్యాల హబ్‌గా ఆంధ్రరాష్ట్రాన్ని తీర్చిదిద్దిన ఘనత జగన్‌దేనన్నారు. రాష్ట్రంలోని పలు విలువైన భూములను తాకట్టు పెట్టి కోట్లాది రూపాయలు తాడేపల్లి ప్యాలెస్‌లో దాచుకున్నారన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేనలతో సాధ్యమన్నారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపినవారిలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహన కార్యదర్శి పంతాని మురళీధరరావు, బాపట్ల జిల్లా కార్యదర్శి తాతా ఏడుకొండలు, నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, నగరం మాజీ జడ్పీటీసీ మేకా వెంకట శివరామకృష్ణ, డాక్టర్ వేజళ్ళ పూర్ణానందం, టీడీపీ మండల అధ్యక్షులు రేపల్లె రామాంజనేయులు, మల్లాది రామకృష్ణ, పంతాని సాయికుమార్, దేవగిరి రవి, కేసన రామకృష్ణ, కొలసాని రాము, డొక్కు బుజ్జి, కొత్త దుర్గాప్రసాద్, యరగళ్ళ శ్రీనివాసరావు, చింతారావు, వెంకట్‌యాదవ్, వీరయ్య పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అనగాని శివప్రసాద్

దళితులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

రేపల్లె, మార్చి 24 : దళితులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా ప్రధాన పార్టీలన్నీ గౌరవించాలని దళితుల ఐక్యవేదిక నాయకులు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, సాంబశివరావు, సుధాకర చంద్రమోహనరావు కోరారు. ఆదివారం కార్యాలయంలో అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గంలో 45 వేల ఓట్లు కలిగిన దళితులు ఉన్నారని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రధాన రాజకీయ పార్టీల్లో ప్రధాన పదవులతో గౌరవం ఇవ్వాలని వారు కోరారు. మాదిగ, మాలల ఐక్య వేదిక కోసం, దళిత గ్రామాల అభివృద్ధి కోసం, దళితుల రాజకీయ ప్రాధాన్యత ఓట్ల సంఖ్య ప్రకారం పెరగాలన్నారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక నాయకులు చందోలు దేవదాసు, ఎ.రాజారత్నం, కూన శ్రీను, డొక్కు శ్రీనుబాబు, కె.రాహుల్, ఎ.నాగేశ్వరరావు, ఓబేద్, ఇమ్మానుయేలు భాస్కర్, కూచిపూడి మోహన్‌రావు, ఈహెచ్ మణిలాల్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వల్లభనేని కృష్ణమూర్తి మృతి

భట్టిప్రోలు, మార్చి 24 : సీపీఎం సానుభూతిపరుడు ఆముదార్లంక గ్రామానికి చెందిన వల్లభనేని కృష్ణమూర్తి (81) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. హోమియో డాక్టర్‌గా ఆముదార్లంక గ్రామంలో పేద వర్గాలకు సేవలందిస్తున్న కృష్ణమూర్తి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు సీపీఎం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, తదితరులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



కోడింగ్ డీకోడింగ్

పార్ట్-2

1. ఒక సంకేత భాషలో BENGALను DGPICNగా రాశారు. అయితే అదే సంకేత భాషలో REGIONను ఏవిధంగా రాస్తారు?
   ఎ) TGIKQP బి) TIKQPG సి) TKGQPI డి) GIKTPQ

సమాధానం: (ఎ)

వివరణ:

2	5	14	7	1	12		18	5	7	9	15	14
B	E	N	G	A	L	ఇదే విధంగా	R	E	G	I	O	N
+2	+2	+2	+2	+2	+2		+2	+2	+2	+2	+2	+2
D	G	P	I	C	N		T	G	I	K	Q	P
4	7	16	9	3	14		20	7	9	11	17	16

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలిస్తే +2 అని తెలుస్తున్నది.

2. ఒక సంకేత భాషలో BOUGHTను ANTFGSగా రాసిన అదే సంకేత భాషలో GOVERNను ఏవిధంగా రాస్తారు?



   ఎ) FNUDQM బి) NFUDMQ సి) FNUQMD డి) FNQDMU

సమాధానం: (ఎ)

వివరణ:

2	15	21	7	8	20		7	15	22	5	18	14
B	O	U	G	H	T	ఇదే విధంగా	G	O	V	E	R	N
-1	-1	-1	-1	-1	-1		-1	-1	-1	-1	-1	-1
A	N	T	F	G	S		F	N	U	D	Q	M
1	14	20	6	7	19		6	14	21	4	17	13

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలించిన -1 అని తెలుస్తున్నది.

3. ఒక కోడ్‌లో DIRECTను EHSDDSగా రాస్తే ఇదే కోడ్‌లో PLAYER ఎలా రాస్తారు?
   ఎ) QKBXFQ బి) QBKQFX సి) OURMNFUL డి) QKBQFX

సమాధానం: (ఎ)

వివరణ:

4	9	18	5	3	20		16	12	1	25	5	18
D	I	R	E	C	T	ఇదే విధంగా	P	L	A	Y	E	R
+1	-1	+1	-1	+1	-1		+1	-1	+1	-1	+1	-1
E	H	S	D	D	S		Q	K	B	X	F	Q
5	8	19	4	4	19		17	11	2	24	6	17

గా రాస్తారు.

పోటీ పరీక్షల ప్రత్యేకం

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలించిన +1, -1 అని తెలుస్తున్నది.

4. ఒక సంకేత భాషలో 'SPECIAL'ను 'PNDCJCO'గా రాశారు. అదే సంకేత భాషలో 'CREATOR'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) ZPCAVQU బి) ZQCAVQU సి) ZPDAUQU డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ:

19	16	5	3	9	1	12		29	18	5	1	20	15	18
S	P	E	C	I	A	L	ఇదే విధంగా	C	R	E	A	T	O	R
-3	-2	-1	0	+1	+2	+3		-3	-2	-1	0	+1	+2	+3
P	N	D	C	J	C	O		Z	P	D	A	U	Q	U
16	14	4	3	10	3	15		26	16	4	1	21	17	21

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే -3, -2, -1, 0, +1, +2, +3 పద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

5. ఒక సంకేత భాషలో 'GREAT'ను 'HTHEY'గా రాశారు. అదే సంకేత భాషలో 'INDIA'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) JPGNE బి) JPGMF సి) JQGNF డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ:

7	18	5	1	20		9	14	4	9	1
G	R	E	A	T	ఇదే విధంగా	I	N	D	I	A
+1	+2	+3	+4	+5		+1	+2	+3	+4	+5
H	T	H	E	Y		J	P	G	M	F
8	20	8	5	25		10	16	7	13	6

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే +1, +2, +3, +4, +5 పద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

6. ఒక సంకేత భాషలో 'MERCY'ను 'NCUYD'గా రాశారు. అదే సంకేత భాషలో 'DREAM'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) EPHWR బి) EWHVR సి) EHPRW డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ:

13	5	18	29	25		4	18	5	27	13
M	E	R	C	Y	ఇదే విధంగా	D	R	E	A	M
+1	-2	+3	-4	+5		+1	-2	+3	-4	+5
N	C	U	Y	D		E	P	H	W	R
14	3	21	25	30		5	16	8	23	18

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలకు గమనిస్తే +1, -2, +3, -4, +5 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

7. ఒక సంకేత భాషలో 'PUBLIC'ను 'OWYPDI'గా రాశారు. అదే సంకేత భాషలో 'MASTER'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) LCPXZX బి) LPCXXZ సి) LPCXZX డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ:

16	21	28	12	9	3		13	1	19	20	31	18
P	U	B	L	I	C	ఇదే విధంగా	M	A	S	T	E	R
-1	+2	-3	+4	-5	+6		-1	+2	-3	+4	-5	+6
O	W	Y	P	D	I		L	C	P	X	Z	X
15	23	25	16	4	9		12	3	16	24	26	24

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే -1, +2, -3, +4, -5, +6 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

నోట్: A, B, C, D, Eలకు కొన్ని సందర్భాలలో 27, 28, 29, 30, 31 ఈ విధంగా తీసుకున్నాం. Z తరవాత ఇంకా అక్షరాలు అవసరమైతే మరలా Aను 27, Bను 28గా ఇలా భావించాలి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

దిక్సూచి
DIKSUCHI

శరణార్థుల పౌరసత్వ కల్పనకు ఉద్దేశించిన 'సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ 2019కి సంబంధించిన రూల్స్ కేంద్రప్రభుత్వం 2024 మార్చి 11న నోటిఫై చేసింది. అలా ఈ చట్టాన్ని అమలులోకి తీసుకురావడంతో, అందులో ఉన్న కొన్ని పరిమితులు, సడలింపుల దృష్ట్యా నిరసనలు చెలరేగుతున్నాయి. ఈ నేపథ్యంలో దాని పూర్వాపరాలు, చట్టంలోని అంశాలు, వస్తున్న విమర్శలు, ప్రభుత్వ వర్గాల వివరణ వంటివి పరిశీలిద్దాం.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్

తమ దేశంలోనే తాము పరాయివారు అయినప్పుడు, నిలువ నీడలేని పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ప్రజలు ఎక్కడికైనా పరుగులు పెడతారు. పరాయి దేశమైనా అక్కున చేర్చుకుంటుందేమో అని ఆశపడుతుంటారు. అలా శరణార్థులు వేల, లక్షల సంఖ్యలో సరిహద్దు దేశాలకు చేరుకోవడం సహజం. భారత్ కూడా అందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే సరైన పత్రాలు, గుర్తింపు ధ్రువీకరణలు లేకుండా దేశంలోకి వచ్చే శరణార్థులతో అటు వారికే కాదు ఇటు దేశ భద్రతకూ ముప్పే. స్థానికుల నుంచి వారు తీవ్ర దోపిడీకి గురవడం, సామాజిక భద్రతా సౌకర్యాలను పొందలేకపోవడం, పేదరికం కారణంగా నేరాల బాట పట్టినా వారిని గుర్తించడం కష్టమవుతుంది. ఆ మాటున ఉగ్రవాదులు చొరబడటం వంటి కారణాల రీత్యా దేశంలోకి వచ్చే శరణార్థులకు చట్టబద్ధ గుర్తింపు అవసరం. తిరిగివెళ్లే అవకాశాలు సమీప భవిష్యత్తులో కనిపించనప్పుడు వారికి పౌరసత్వం కల్పించి ఆదుకోవడం కూడా సముచితమే.

ఈ పౌరసత్వ సవరణ చట్టానికి నాంది 2002లోనే పడింది. పాకిస్థాన్‌లో తీవ్ర దౌర్జన్యాలకు గురవుతున్న స్థానిక హిందువులకు భారత దేశ వీసాలు పొందేందుకు సహకరించాలని, అదే సమయంలో అక్రమ ప్రవేశాలను అడ్డుకోవాలని ఒక సరిహద్దు రాష్ట్రంగా రాజస్థాన్ ప్రభుత్వం అప్పటి ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి విన్నవించింది.

దీని ఫలితంగా 2004లో అప్పటి ప్రధాని వాజపేయీ ప్రభుత్వం, పౌరసత్వ నిబంధనలను సవరించింది. రాజస్థాన్, గుజరాత్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంత జిల్లాల మెజిస్ట్రేట్‌లకు - లాంగ్ టర్మ్ వీసా లు, పౌరసత్వం కల్పించే అధికారాన్ని కల్పించింది.

అదేవిధంగా 2010 జూన్‌లో అప్పటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కూడా కొన్ని వర్గాలకు చెందిన పాకిస్థానీయులకు వారి పాస్‌పోర్టు వాలిడిటీతో సంబంధం లేకుండా, లాంగ్‌టర్మ్ వీసాలను పునరుద్ధరించవచ్చని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు అనుమతినిచ్చింది. దీనికి 2009 డిసెంబరు 31ని కటాఫ్ డేట్‌గా నిర్ణయించింది.

అంటే అప్పటిలోగా లాంగ్‌టర్మ్ వీసాలను పొందిన పాకిస్థానీ హిందువులు, సిక్కులు, భారతీయ వ్యక్తిని వివాహం చేసుకొని భారత్‌లో నివసిస్తున్న పాకిస్థానీ మహిళలు, పాకిస్థానీయులను వివాహం చేసుకొని విడాకులు పొందిన భారత స్త్రీలు/ వితంతువులు, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న వారికి ఈ వీసా పొడిగింపును కల్పించింది. అదేవిధంగా భారతీయ ముస్లిం తన కుటుంబాన్ని వదిలి దేశవిభజన సమయంలో పాకిస్థాన్‌కు వెళ్లిపోయి, తదుపరి వాలిడ్ పాకిస్థాన్ పాస్‌పోర్టుతో తిరిగివచ్చి కేరళలో స్థిరపడిన సందర్భంలో కూడా లాంగ్‌టర్మ్ వీసాను అందించారు. 2014 డిసెంబరులో నరేంద్రమోడీ ప్రభుత్వం పాకిస్థాన్ నుంచి వచ్చిన హిందూ, సిక్కు, క్రిస్టియన్, బుద్ధిస్ట్ శరణార్థులకు పౌరసత్వం ఇచ్చేందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2015-16లో భారతదేశంలో ప్రవేశానికి సంబంధించిన పాస్‌పోర్ట్ రూల్స్ సవరించి పాక్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి వచ్చిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రిస్టియన్ శరణార్థులకు సరైన పాస్‌పోర్ట్/ వీసా ధృవీకరణలు లేనప్పటికీ అనుమతించేవిధంగా నియమ నిబంధనలను మార్చారు.

తదుపరి 2018లో ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీచేసి ఈ వర్గాల వారు భారతీయ పౌరసత్వం పొందాలనుకుంటే వారిని లాంగ్‌టర్మ్ వీసాలకు అర్హులను చేసింది. అదేవిధంగా వారు ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకోవడానికి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి, బ్యాంక్ అకౌంట్స్ తెరవడానికి, ఇల్లు కొనుగోలుకు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను పొందడానికి వారిని అనుమతించడం వంటి సౌలభ్యాలు కల్పించింది.

ఈ నోటిఫికేషన్ల స్థానంలో సమగ్ర విధివిధానాలను రూపొందించేందుకు కేంద్రం 1955 నాటి పౌరసత్వ చట్టాన్ని సవరించింది. తాజాగా 2019లో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చింది. అయితే కేవలం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలకు చెందిన శరణార్థులకు మాత్రమే అనుమతివ్వడం, ఇతర సరిహద్దు దేశాల శరణార్థులకు, ముస్లిం మతస్థులకు అనుమతి లేకపోవడం విషయమై తీవ్ర విమర్శలు చెలరేగి దేశవ్యాప్త నిరసనలు ఉధృతమయ్యాయి. అయితే 2019 డిసెంబర్ నాటికి చిన్నగా మొదలై దేశంలో కరోనా పరిస్థితులు ప్రారంభమైన సమయంలో ఈ నిరసనలూ సద్దుమణిగాయి. అయితే ఇండియన్ యూనియన్ ముస్లిం‌లీగ్ వంటి సంస్థలు; అసోం గణపరిషత్, నేషనల్ పీపుల్స్ పార్టీ, డిఎంకే వంటి రాజకీయ పార్టీలు; జైరాం రమేష్, మహువా మొయిత్రా వంటి ప్రముఖులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ విషయమై సుప్రీంకోర్టులో దాదాపు 200లకు పైగా పిటీషన్లు ఫైల్ అయ్యాయి.



ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకోవడానికి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి, బ్యాంక్ అకౌంట్స్ తెరవడానికి, ఇల్లు కొనుగోలుకు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను పొందడానికి వారిని అనుమతించడం వంటి సౌలభ్యాలు కల్పించింది.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

గనుల శాఖలో ఘనుడు!

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ రహస్యమే. ఒక కంపెనీలో ఉద్యోగి అయి ఉండి, మరో నాలుగు కంపెనీల పనులు కూడా ఎండీసీలో చక్కబెడుతుండటం ఆయనకే చెల్లింది. అందుకే ఎండీసీ అధికారులు, సిబ్బంది ఆయన్ను 'కార్పొరేట్ లాబీయిస్ట్'గా పిలుస్తుంటారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన కంపెనీకి ఇప్పించిన బెరైటీస్ కాంట్రాక్ట్ కార్యరూపం దాల్చలేదు. అది నిబంధనల ప్రకారం 2010లోనే రద్దవ్వాల్సి ఉంది. దాన్ని రద్దుచేయనివ్వకుండా నిరంతరం లైవ్‌లో ఉండేలా ప్రయత్నిస్తున్నారు. ఇక, ఆ సంస్థ కోసం మంగంపేటలోనే ఓ ప్లాంటు పేరు చెప్పి 100 ఎకరాలు ఇప్పించేందుకు ప్రతిపాదనను కదిలించారు. ఎప్పుడో రద్దవ్వాల్సిన ఒప్పందం 16 ఏళ్ల తర్వాత కూడా కొనసాగడం, ఆ కంపెనీకే 100 ఎకరాలు ఇప్పించేందుకు ఆఘమేఘాల మీద ప్రతిపాదనలు రెవెన్యూ దాకా తీసుకెళ్లడంలో ఆయనదే కీలక పాత్ర. భూమి ఇవ్వడం కుదరదని రెవెన్యూ చెప్పినా గనుల శాఖతో రెండోసారి లేఖలు రాయించేలా లాబీయింగ్ చేయగలిగారు. ఇందులోనే ఓ పెద్ద మతలబు ఉంది. 2008 నాటి ఒప్పందం ప్రకారం 100 ఎకరాలు ఇస్తే, ఆనాడు నిర్ణయించిన ధర మేరకే బెరైటీస్‌ను సరఫరా చేయించేలా ఎండీసీని ఒప్పించడం మరో పెద్ద లాబీ. ఇప్పుడు ఆయన దృష్టంతా దీనిపైనే ఉంది. అదే జరిగితే ఎండీసీ నిండా మునిగిపోనుంది. చిన్న కంపెనీలు తమకు ఎక్కడ పోటీ వస్తాయో అన్న భయంతో వాటిని ఎండీసీ ప్రోత్సహించకూడదంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఇదే అంశంపై ఎండీసీ ఎండీకి లేఖ కూడా రాశారు. దీనిపై నాటి ఎండీ తీవ్రంగా స్పందించారు. "నీకు ఈ విషయంలో సంబంధం లేదు. అనవసర విషయాల్లో వేలు పెట్టవద్దు" అని తీవ్రంగా హెచ్చరించారు. అంతే, తన పలుకుబడిని ఉపయోగించి నాటి ఎండీనీ ఆ పోస్టు నుంచి తప్పించారు. ఎండీగా మధుసూదన్ రెడ్డి ఉన్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

ఎవరికి ఏ పనిచెప్పాలో కూడా

బెరైటీస్, క్వార్ట్జ్, ఇతర ఖనిజాల టెండర్లు ఎవరికి ఇవ్వాలి? ఏ ఉద్యోగిని ఏ విభాగంలో కూర్చోబెట్టాలి? ఏ అధికారికి ఏయే సబ్జెక్టులు కట్టబెట్టాలో పెద్ద లిస్టే ఇచ్చారు. వాటిని మధుసూదన్‌రెడ్డి పట్టించుకోకుండా, అధికారుల పనితీరు ఆధారంగా విధులు అప్పగించారు. దీంతో 'నా మాటే వినరా' అంటూ సదరు లాబీయిస్టు రచ్చచేశారు. దీంతో ఆయనను ఆఫీసు రిసెప్షన్‌కే పరిమితం చేశారు. ఆఫీసుల్లోని విభాగాలకు వెళ్లకుండా నియంత్రించారు. దీంతో అనేక లాబీయింగ్ పనులు నిలిచిపోయాయి. తన కంపెనీ పెద్దను తీసుకొచ్చి మధుసూదన్‌రెడ్డిని మచ్చిక చేసుకుని, మరోసారి పొరపాటు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. మధుసూదన్ రెడ్డి బదిలీ తర్వాత లాబీయిస్ట్‌కు మళ్లీ మునుపటి స్వేచ్ఛ వచ్చింది.

మార్కెటింగ్ విభాగం అడ్డాగా వ్యవహారాలు



ఎండీసీలో మార్కెటింగ్ విభాగం కీలకమైంది. దీనిలోని ఓ అధికారి ఈ లాబీయిస్ట్‌కు సన్నిహితుడు. అంతే మార్కెటింగ్ విభాగం అడ్డాగా ఆయన ఎండీసీలోని పరిపాలన, వ్యాపార పరమైన అంశాలతోపాటు బిల్లుల చెల్లింపు, లీజుల అనుమతి వరకు తను శాసించగలిగేలా ఎదిగారు. తన కంపెనీల పనులతోపాటు మరో నాలుగు కార్పొరేట్ పనుల ఫైళ్ల పరిష్కరించేందుకు నేరుగా విభాగాలకు వెళ్లడం, అక్కడి వారికి ఆదేశాలు ఇచ్చి ఆగమేఘాల మీద పనులు చేయాలని ఒత్తిడి తీసుకొస్తుంటారు. వారు వింటే సరే. కాదన్న వారికి గనుల శాఖలోని ముఖ్య అధికారి కార్యాలయం నుంచి ఫోన్‌లు చేయిస్తారు. అయినా కూడా మాట వినని వారికి ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఓ అధికారి నుంచి ఫోన్‌లు చేయిస్తుంటారు. ఇంత జరిగాక లాబీయిస్ట్ చెప్పిన పనులు ఎందుకు ఆగుతాయి? ఆయన చెప్పిన వారికే ఖనిజ తవ్వకాల దరఖాస్తుల పరిష్కారం లభిస్తుంది. లీజుల అనుమతులు ఇస్తున్నారు. బిల్లుల చెల్లింపు కూడా చకచకా జరుగుతుంది.

పనిని బట్టి రేటు

'లాబీయిస్ట్' శక్తి తెలుసుకున్న పలు కంపెనీలు, కాంట్రాక్టు సంస్థలు తమ పనులు చక్కబెట్టాలంటూ ఈయననే ఆశ్రయించడం, దీనికి ఆయన పనిని బట్టి రేటును నిర్ణయించడం షరా మామూలుగా మారింది. దీంతో గనుల శాఖ నుంచి ఆర్థికశాఖ, రెవెన్యూ, పరిశ్రమలు, పురపాలక శాఖ, ఆర్‌అండ్‌బీ విభాగాల్లో కలియతిరిగి పనులు చక్కబెడుతున్నారని తెలిసింది. ఎండీసీలోని మార్కెటింగ్ విభాగాన్ని అనధికారిక కార్యాలయంగా మార్చుకున్నారు. అక్కడి నుంచే మైన్స్‌తోపాటు ఇతర శాఖల పనులు, వ్యవహారాలు చక్కబెడుతున్నారని తెలిసింది. దీనికి మార్కెటింగ్‌లోనే ఓ అధికారి పూర్తిగా సహకరిస్తున్నట్లు తెలిసింది. ఇక ఆయన చెప్పిన పనులు చేసిపెట్టేవారికి బంపర్ ఆఫర్లు, గిఫ్టులు, ఇతర ప్రోత్సాహకాలు ఇస్తుంటారని తెలిసింది. గనుల శాఖలో ఎవరైనా ఉద్యోగి ఒక రోజు సెలవుపెట్టి ఆఫీసుకు రాకుండా ఉంటారమో కానీ ఈయన మాత్రం ఖచ్చితంగా వస్తుంటారు. ఆయన వచ్చాకే మిగతా పనులు సాగిపోతుంటాయి.

ఎందుకు ప్రోత్సహిస్తున్నారు?

గనుల శాఖ ఓ కార్పొరేట్ ఉద్యోగిని ఎందుకు ప్రోత్సహిస్తోంది? ఇది అందరినీ వేధిస్తున్న ప్రశ్న. ఎండీసీతో వ్యాపారం చేసే మైనింగ్ కంపెనీల ప్రతినిధులు తమ సొంత పనులపై గనుల శాఖ అధికారులను కలిసి వెళ్తుంటారు. తమ విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని కోరుతుంటారు. ఇదంతా రొటీన్‌గా జరిగిపోయేదే. కానీ, ఉద్యోగులకన్నా ముందే ఆఫీసుకు వచ్చి రోజులో 24 గంటలపాటు ఆఫీసులోనే మకాం వేయడమే అసలు సమస్య. సొంత కంపెనీ పనులతోపాటు, ఇతర కంపెనీల వ్యవహారాలు, ఇంకా ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌లు, సబ్జెక్టుల అప్పగింత, లీజులు, బిల్లుల చెల్లింపు వంటి అంశాలను ప్రభావితం చేసేలా ఓ లాబీయిస్టు సర్వాంతర్యామిగా మారితే అధికారులు ఎందుకు మిన్నకుంటున్నారు? అతన్ని ఎందుకు నియంత్రించలేకపోతున్నారు? అతన్ని అడ్డుకోవడంలో ఎందుకు భయపడిపోతున్నారు? ఈ విషయంలో అనేక సందేహాలున్నాయి. అతను లాబీయిస్టుగా మారడం వెనుక ముఖ్య అధికారుల ప్రోత్సాహం కూడా ఉందన్న వాదన వినిపిస్తోంది.

భక్తుల కొంగుబంగారం శింగరకొండ



శింగరకొండ వ్యూ

» నేడు ప్రధాన తిరునాళ్ల

అద్దంకి, మార్చి 24: శింగరకొండ క్షేత్రం భక్తుల కొంగు బంగారంగా ఖ్యాతికెక్కింది. ఒకప్పుడు ఇక్కడ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం ఆ దేవాలయాలతో పాటు భక్తాంజనేయస్వామి దేవాలయం, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, అయ్యప్పస్వామి దేవాలయం, శ్రీకృష్ణుని దేవాలయం, 99 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయాలు, ఇంకా పలు చిన్న దేవాలయాలు ఉన్నాయి. కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి మెట్ల మార్గం ఉంది. మూడు దశాబ్దాల క్రితం కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం చేశారు.



బాలాలయంలో ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి,



ప్రత్యేక అలంకరణలో శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి

రెండు తెలుగు రాష్ట్రాలలో దక్షిణ ముఖంగా ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం శింగరకొండలో మాత్రమే ఉంది. 1916లో భవనాసి చెరువు నిర్మాణం పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలలో పనులు పూర్తి చేశారు. ఆ సమయంలో ఆంజనేయస్వామి దేవాలయం కొద్దిమేర అభివృద్ధి చేశారు. తొలుత మంగళ, శని వారాలలో మాత్రమే భక్తులు శింగరకొండకు వచ్చేవారు. 1960 నుచి దేవాలయం దేవదాయశాఖ పరిధిలోకి చేరింది. అనంతరం భక్తులు, దాతల సహకారంతో దేవాలయం అభివృద్ధి చెందింది. 1984లో ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగింది. దక్షిణ రాజగోపురాన్ని దేవాలయం నిధులతో నిర్మించగా, మిగిలిన మూడు రాజగోపురాలను దాతల సహకారంతో నిర్మించారు. దేవస్థానం ముఖ మండపం పునర్నిర్మాణానికి టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.4 కోట్లు మంజూరయ్యాయి. మరో రూ.3 కోట్లు దాతల నుంచి సేకరిస్తూ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో పక్కనే బాలాలయంలో ప్రత్యేకంగా మొద్దుతో స్వామి వారి విగ్రహం తయారు చేయించి ప్రతిష్ఠించారు. ప్రస్తుతం కూడా అక్కడే స్వామి వారి దర్శనం కొనసాగుతుంది. ప్రధాన ఆలయం పనులు పూర్తయ్యేందుకు మరి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

దాతల సహకారంతో మారిన రూపురేఖలు

శింగరకొండలో ఇటీవల కాలంలో దాతల సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరగటంతో రూపురేఖలు మారిపోయాయి. శింగరకొండలో టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం, దాతల సహకారంతో సుమారు రూ.7 కోట్లతో రాతి ముఖ మండపం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దాతల సహకారంతో పొంగలిశాల, భక్తుల విశ్రాంతిశాల, నిత్యాన్నదాన భవనం, షాపింగ్ కాంప్లెక్స్, పరిపాలన భవనం, కేశ ఖండన శాల, పోలవరపు యాగశాల, గోశాల నిర్మాణం చేశారు. దామచర్ల అతిథి గృహం ఆదునికీకరణ పనులు చేపట్టారు.

మూడు రోజులపాటు ఉత్సవాలు

ప్రతి ఏటా పాల్గుణ శుద్ధ త్రయోదశి నుండి పౌర్ణమి వరకు మూడు రోజుల పాటు తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతాయి. మూడోరోజు ప్రధాన తిరునాళ్ల జరుగుతుంది. ఈఏడాది మార్చి 23 నుంచి 25 వరకు 69వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతునున్నాయి. ప్రధాన తిరుణాళ్ల సోమవారం జరగనుంది.

తొలిసారి ఒకేఒక్క విద్యుత్ ప్రభ

తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభమై 69 సంవత్సరాలు కాగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఒకే ఒక్క విద్యుత్ ప్రభ ఏర్పాటు జరుగుతుంది. రాజకీయ పార్టీ ల నేతల ఆద్వర్యంలో విద్యుత్ ప్రభల ఏర్పాటు జరుగుతుంటుంది. ఈ ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీల జెండాలు ఏర్పాటు కు అనుమతి లేక పోవటం, డ్యాన్స్‌లకు పోలీస్ అధికారులు అనుమతులు ఇవ్వకపోవటంతో విద్యుత్ ప్రభల ఏర్పాటుకు వెనకడుగు పడింది.

అద్దంకి మున్సిపాలిటీ లోని వైసీపీ కౌన్సిలర్ ల ఆధ్వర్యంలో మా త్రమే ఒకే ఒక్క విద్యుత్ ప్రభ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భక్తులు ఒకింత నిరుత్సాహం కు గురవుతున్నారు. అదే సమయంలో ప్రధాన ఆలయం రాతి మండపం నిర్మాణ పనులు జరుగుతుండగా బాలాలయం లో ఆంజనేయస్వామి దర్శనం చేసుకోవాల్సి రావటం కూడా భక్తులలో నిరాసక్తతను మరింత పెంచింది. దీంతో గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు ఈ ఏడాది శింగరకొండ వార్షిక తిరునాళ్లకు ఏర్పడ్డాయని భక్తులు అభి ప్రాయపడుతున్నారు.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి వారికి విశేష అభిషేకం నిర్వహిస్తున్న పూజారులు

వైభవంగా అభిషేకాలు

అద్దంకి, మార్చి 24: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69వ వార్షికోత్సవ తిరునాళ్ల ఉత్సవాలు రెండోరోజు ఆదివారం వైభవంగా సాగాయి. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఉదయం సుప్రభాత సేవ, బిందె తీర్థం నిర్వహించారు. అనంతరం విశేష అభిషేకం నిర్వహించారు. రుత్వికులచే మహన్యాస పూర్వక ఏకాదశ మన్యుసూక్త వారాభిషేకం, సుందరాకాండ పారాయణ, సూర్య నమస్కారాలు, సప్తశతి పారాయణ, పంచామృతాలు, దశ ద్రవ్యాలచే విశేష అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన భజన, శ్రీసాయి నాట్య కళాసమితి ఆధ్వర్యంలో ప్రదర్శించిన దేవనర్తకి పూర్తి నాటకం, కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామి వారికి ఉష్ట్ర వాహన సేవ నిర్వహించారు.

ప్రధాన తిరునాళ్ల సందర్భగా సోమవారం ఉదయం సుప్రభాత సేవ, బిందె తీర్థం, ప్రాతఃకాలార్చన నిర్వహించనున్నారు. ఉదయం 5.30 నుంచి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్విరామంగా స్వామి వారి దివ్య దర్శనం ఉంటుంది. సోమవారం ఉదయం 10 గంటలకు భజన, రాత్రి 7 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన, సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు రథోత్సవం కన్నుల పండుగగా సాగనుంది.

లక్ష్మీనరసింహస్వామి దేవాలయం లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. రెండు దేవాలయాల వద్ద విద్యుత్ దీపాల వెలుగులతో దేదీప్యమానంగా మారింది. సోమవారం కొండపైకి దాతల సహకారంతో ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా అద్దంకి డిపో నుంచి 30 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. ఒంగోలు, పొదిలి, వినుకొండ, నర్సరావుపేట డిపోల నుంచి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. సుమారు ఆరువందల మంది పోలీస్‌లతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నామ్ రోడ్డులో ట్రాఫిక్‌ను మేదరమెట్ల, సంతమాగులూరు అడ్డ రోడ్డుల వద్ద నుంచి చిలకలూరిపేట, నర్సరావుపేట ల మీదుగా మరల్చనున్నారు.



పూనూరులో మట్టల పండుగలో ఊరేగింపుగా చిన్నారులు

ఘనంగా మట్టల ఆదివారం

» చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

అద్దంకిటౌన్, మార్చి 24: మట్టల ఆదివారం సందర్భంగా అద్దంకి మండలంలోని గ్రామాలు, పట్టణంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని పసుమర్తిపాలెం డాక్టర్ క్లౌమోమోరియల్ సెంటనరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి, కట్టకింద పాలెం, మండలంలోని ధేనువకొండ పునరావాస కాలనీ బలరామకృష్ణపురం, ఇతర గ్రామాల్లోని చర్చిల వద్ద ముందుగా సండేస్కూల్ చిన్నారులు మట్టలు పట్టుకుని క్రీస్తు పాటలు పాడుతూ, వ్యాకోపదేశం చేస్తూ పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పసుమర్తిపాలెం తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి సంఘకాపరి డాక్టర్ యేసుబాబు మాట్లాడుతూ గుడ్ ఫ్రైడేకి ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ పాలపర్తి ప్రభాకర్, సండే స్కూల్ టీచర్‌లు కె.రీతూ, వై.సరోజిని, పి.ప్రభావతి, వి.బుజ్జమ్మ, ఎం.సరళ, సంఘపెద్దలు , తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలోని లూథరన్ చర్చిలో ఆదివారం మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట సంఘ కాపరి బొంతు రాజేష్ ఆధ్వర్యంలో చిన్నారులు మట్టలతో వీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సండే స్కూలు చిన్నారులు కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమంలో బొంతు రాజేష్, సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

చీరాలటౌన్: చీరాల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పలు క్రైస్తవ దేవాలయాల్లో ఘనంగా వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా క్రైస్తవులు, చిన్నారులు ఈత మట్టలకు పూలను అలంకరించి ర్యాలీలు నిర్వహించారు. క్రైస్తవులు ఆయా మందిరాల్లో అధిక సంఖ్యలో హాజరు ప్రార్థనలు చేశారు.

బొల్లాపల్లిలో అక్రమ తవ్వకాలు

» యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు » పట్టించుకోని అధికారులు



బొల్లాపల్లి కొండ పోరంబోకు ప్రదేశంలో ఎక్స్‌కవేటర్‌తో టిప్పర్‌కు నింపుతున్న గ్రావెల్

మార్టూరు, మార్చి 24: మండలంలోని బొల్లాపల్లి గ్రావెల్ కొండ పోరంబోకు వద్ద గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బొల్లాపల్లి టోల్ ప్లాజాకు సమీపంలోని జగనన్న కాలనీకి దగ్గరలో గ్రావెల్ కొండ నుంచి గ్రావెల్‌ను తవ్వి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గత మూడు రోజుల నుంచి నిరాటంకంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. బొల్లాపల్లి గ్రామానికి చెందిన వైసీపీ మద్దతుదారులైన ఇద్దరు వ్యక్తులు గ్రావెల్ తవ్వకాలలో సూత్రధారులుగా ఉన్నట్లు తెలిసింది. వారిలో ఒక వ్యక్తి గ్రావెల్ తవ్విన ప్రదేశాన్ని ఆక్రమించుకొని స్వాధీనం చేసుకోవాలనే ముందస్తు ఆలోచనలో ఉండగా, మరో వ్యక్తి సొంతంగా ఉన్న ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్‌ను అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది.

జాతీయ రహదారికి తూర్పు వైపున బొబ్బేపల్లి, ద్రోణాదుల గ్రామాలకు చెందిన ఎర్ర మట్టి తవ్వకాలు నిలిచిపోయాయి. కోలలపూడి గ్రామంలో మాత్రం అధికారికంగా అనుమతులు ఉన్నాయని ఒక వ్యక్తి తవ్వకాలు చేస్తున్నారు. వలపర్లలో గ్రావెల్ కొండ నుంచి గ్రావెల్‌ను తీసుకెళ్లాలంటే జాతీయ రహదారిని దాటి వెళ్లాలి. దీంతో జాతీయ రహదారికి తూర్పు వైపున ఉన్న బొల్లాపల్లి గ్రావెల్ కొండ నుంచి తరలించే గ్రావెల్‌కు డిమాండ్ ఉండటంతో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమ తరలింపుపై కన్నేశారు. దాంతో గ్రామానికి సమీపంలో ఉన్న గ్రావెల్ కొండ పోరంబోకు ప్రదేశం నుంచి గ్రావెల్ అక్రమ తవ్వకం చేపట్టారు. ఆరు యూనిట్లు గ్రావెల్‌ను నింపే డంపరు వాహనం నుంచి రెండు వేల రూపాయలను వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇంకా టిప్పర్లు, ట్రాక్టర్లుకు గ్రావెల్‌ను లోడింగ్ చేసి డబ్బులను వసూలు చేస్తున్నారు. పగలు సమయాలలో సమీపంలోని మామిడి తోటల్లో ఎక్స్‌కవేటర్‌ను దాచిపెట్టి అర్ధరాత్రి సమయంలో సడన్‌గా బయటకుతీసి గ్రావెల్‌ను తవ్వి సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

గతంలోనూ ఈప్రదేశంలో కొంతమంది వ్యక్తులు అడపాదడపా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి సొమ్ములను సంపాదించిన సంఘటనలు ఉన్నాయి. ఈ కొండలో అక్కడక్కడ సడన్‌గా అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. మైనింగ్ అధికారులు సమాచారం అందుకొని వచ్చేలోపే మామిడితోటల్లోకి వెళ్లిన ఎక్స్‌కవేటర్‌లు కనిపించకుండా పోతుంటాయి. అధికారులు పూర్తిగా నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకుంటేనే అక్రమ తవ్వకాలు ఆగుతాయని బొల్లాపల్లి గ్రామస్థులు భావిస్తున్నారు.

వైసీపీ కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, మార్చి 24: అధికారం కోసం జగన్ కుయుక్తులు, కుట్రలు, దౌర్జన్యాలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం పర్చూరు, కుంకలమర్రు గ్రామాలకు చెందిన వంద కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఏలూరి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలంతా ఏకమై తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలవాలన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రానికి స్వర్ణయుగం వస్తుందని చెప్పారు. భూ హక్కు చట్టంపేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కొనేందుకు జగన్ రెడ్డి కుట్రపన్నారన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం, కొత్త మాధవరంలో బీసీ చేనేత కుటుంబానికి చెందిన పాలా సుబ్బారావుకు చెందిన మూడు ఎకరాల భూమి వైసీపీకి చెందిన నాయకులు లాక్కోవటంతో మొత్తం కుటుంబం ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులు ఏవిధంగా అన్యాక్రాంతం అవుతున్నాయో చెప్పటానికి ఇది ఒక ఉదాహరణ అని అన్నారు. జగన్ రెడ్డి తెచ్చిన కొత్త చట్టం భూకబ్జాదారులకు వరంగా మారిందన్నారు.

పర్చూరుకు చెందిన వైసీపీ నాయకుడు ఆకుల మధుబాబు ఆధ్వర్యంలో పలు కుంటుంబాలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వైసీపీ సీనియర్ నాయకుడు ఇమిడిశెట్టి పెద్దబ్బాయి, శీలం శ్రీనివాసరావు, ఇందిరా కాలనీ, అంబేద్కర్ కాలనీకి చెందినవారు ఉన్నారు.



టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

కారంచేడు మండలం కుంకలమర్రుకు చెందిన వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పందరబోయిన ప్రసాద్, నక్కల వాసు, బండారు కిరణ్, బత్తుల అభిల్, మురిపిడి గోపి, చల్లా రాఘవరావు, పులగం రామ సుబ్బారావు మణికంఠ, కమ్మిల సురేష్, షేక్ మస్తాన్‌వలి, పులి జగదీష్, మురిపి వెంకటేష్, ఉప్పు బసవయ్య, బోయిన బుజ్జి, కొమ్మనబోయిన సాయి, నర్రా గోపీనాథ్, గంజి అర్జులు ఉన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంగారు బాబు, కడియం మణికంఠ, కడియం రాంబాబు, రావల సూర్యన్నారాయణ, ఏమవరపు నాగశంకర్రావు, కరిచేటి రాజేష్, గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు ప్రభుత్వ వైద్యశాలలో హైడ్రామా!

» చికిత్స పొందుతున్న వ్యక్తిని స్టేషన్‌కు తరలించేందుకు బల్లికురవ పోలీసుల అత్యుత్సాహం

మార్టూరు, మార్చి 24: మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిన్నేటి నాగరాజు అనే వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు బల్లికురవ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బాధితుడు తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు కావడంతో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు బల్లికురవ పోలీసులు హైడ్రామాకు తెరతీశారని సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే, మీడియా ప్రతినిధులు ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరడంతో పోలీసులు తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఈ సంఘటన ఆదివారం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది.

బల్లికురవ మండలం వేమవరం కూడలిలో శనివారం మద్యం తాగుతున్న క్రమంలో పిన్నిటి నాగరాజు, కొండవర్తు గోపిరాజు గొడవపడ్డారు. ఈక్రమంలో పిన్నేటి నాగరాజు తలకు గాయం కావడంతో చికిత్స నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం రాత్రి చేరారు. వైద్యులు అతని తలకు కుట్లు వేసి వైద్యం చేశారు. ఈ గొడవకు సంబంధించి ఒకరిపై మరొకరు చేసిన ఫిర్యాదులు బల్లికురవ స్టేషన్‌కు చేరాయి. ఈనేపథ్యంలో అధికార పార్టీ నాయకుల ప్రభావమో, ఇతరత్రా కారణాలో గాని బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డి ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు పోలీసులను పంపించి నాగరాజును స్టేషన్‌కు తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యులు నాగరాజును ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే, నాగరాజుకు ఇంకా ఇబ్బందిగా ఉందని, పూర్తిగా కోలుకోలేదని కుటుంబ సభ్యులు పోలీసులను, వైద్యులను విన్నవించుకున్నారు. ఈక్రమంలో నాగరాజును స్టేషన్‌కు తీసుకెళ్లడానికి పోలీసులు ప్రయత్నాలు చేసే సమయంలో మీడియా రంగప్రవేశం చేయడంతో పోలీసులు వెనక్కితగ్గారు. కొన్ని పరీక్షలను చేయించుకోవాలని నాగరాజు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఉన్నారు.



మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితుడు పిన్నేటి నాగరాజు (తెల్ల చొక్కాతో ఉన్న వ్యక్తి)

ఇదిలాఉండగా కొన్నిరోజుల క్రితం బల్లికురవలో మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన వృద్ధుడిపై ఎస్ఐ చేయి చేసుకున్నాడు. ఈ సంఘటనపై డీఎస్పీ స్థాయిలో విచారణ జరుగుతున్నది. ఈసమయంలో ఈ సంఘటన చోటుచేసుకోవడంతో ఎస్ఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అతని చర్యలు వివాదాస్పదంగా ఉన్నాయని మండలంలో చర్చ నీయాంశమైంది.

కూటమి అభ్యర్థి గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలి

» ఎంఎం కొండయ్య

చీరాల, మార్చి 24: టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలని చీరాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం దేవాంగ సామాజికవర్గంలో కీలక భూమిక పోషిస్తున్న బాలానందం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు, టీడీపీ నేత సజ్జా వెంకటేశ్వరరావును కొండయ్య ముఖ్యనాయకులతో కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భావసారూప్యంతో కలిసొచ్చే అందరిని కలుపునకు పోదామన్నారు. ఈసందర్భంగా వెంకటేశ్వరావు మర్యాదపూర్వకంగా కొండయ్యను సత్కరించారు. అనంతరం మండల పరిధిలోని హస్తినాపురంలో బాలభక్త కమిటీ ఆహ్వానం మేరకు శ్రీగణపతి స్వామివారి ముఖమండప ప్రారంభోత్సవ ప్రత్యేక పూజల్లో కొండయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ యాజమాన్య ప్రతినిధులు, సిబ్బంది కొండయ్యను కలసి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో నిలిచినందుకు అభినందనలు తెలిపారు. సాయంత్రం పేరాల కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరిగిన ప్రత్యే పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తదనంతరం తోటవారిపాలెం దేవస్థాన ప్రాంగణంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.



కూటమి అభ్యర్థి కొండయ్యను సత్కరిస్తున్న బాలానందం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు సజ్జా వెంకటేశ్వరరావు

చేనేత కుటుంబం ఆత్మహత్య బాధాకరం

చీరాల, మార్చి 24: సీఎం జగన్‌రెడ్డి పాలనలో బడుగుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయి. తాజాగా కడపలో చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకోవటం అందుకు నిదర్శనమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు, ఆయన భార్య పద్మావతి, కుమార్తె వినయ ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారికి శ్రద్ధాంజలి ఘటించారు. జగన్ ప్రభుత్వ నియంత పోకడలను ఎండగట్టారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన కలిగిఉండాలి

అద్దంకిటౌన్, మార్చి 24: క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగిఉండాలని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్‌కుమార్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం అద్దంకి సీహెచ్‌సీ సిబ్బంది, టీబీ యూనిట్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్‌ప్రభాకర్, బి.రాజశేఖర్, శ్రీనివాస్, సత్తార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, హెల్ప్ టీబి ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని డీఐసీ పరిదిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్‌కుమార్, హెల్ప్ టీబి ప్రతినిధులు వి.కరుణ, టి.శ్రావణి, పార్వతి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

చీరాల: క్షయ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మహిళా మండలి ప్రతినిధులు, ఆశా వర్కర్లు అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఏరియా వైద్యశాల నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మహిళా మండలి బాధ్యులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

చీరాల, మార్చి 24: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నా రు. స్థానిక రామకృష్ణాపురంలోని హైమా హాస్పటల్లో యూరాలజీ విభాగా న్ని ఆదివారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ గుంటుపల్లి (హైమా) సుబ్బారావు, డాక్టర్ గోరంట్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిదిలోని హస్తినాపురంలో శ్రీగణపతి స్వామి వారి ముఖద్వార మండపం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్ పాల్గొన్నారు. తీర్థప్ర సాదాలు స్వీకరించారు.

చికిత్స పొందుతూ ఏఎన్ఎం మృతి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), మార్చి 24: చికిత్స పొందుతూ సచివాలయ ఏఎన్ఎం శనివారం రాత్రి మృతి చెందింది. మండల పరిధిలోని ఈపూరుపాలెం సావరపాలెంకు చెందిన బత్తుల రాజ్యలక్ష్మి(47) గవినివారిపాలెం సచివాలయం 2లో విధులు నిర్వహిస్తుంది. ఆమెకు భర్త, ఇద్దరు సంతానం. వారం క్రితం పట్టణంలో ఓ ప్రయివేట్ వైద్యశాల ప్రతినిధులు కొవిడ్ సమయంలో విశేష సేవలు అందించిన ఆరోగ్య సిబ్బందికి ఐఎంఏ హాలులో సన్మానించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న రాజ్యలక్ష్మి ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరిలోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. పరీక్షలు చేసి తలలో రక్తం గడ్డ కట్టినట్లుగా గుర్తించి చికిత్స అందిస్తున్నారు. అప్పటినుంచి అపస్మారక స్థితిలో ఉన్న ఆమె శనివారం రాత్రి మృతిచెందింది. ఆదివారం జరిగిన అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ఆరోగ్య సిబ్బంది హాజరై నివాళులర్పించారు.

డాక్టర్ పోలవరపు సేవలు మరువలేనివి

చీరాలటౌన్, మార్చి 24: డాక్టర్ పోలవరపు వెంకటేశ్వర ప్రసాద్ చీరాల పరిధిలోని అనేక మంది నిరుపేదలకు అందించిన సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో చీరాల రోటరీ క్లబ్, కళాంజలి సంస్థలు సంయుక్తంగా ప్రముఖ వైద్యులు డా.పోలవరపు సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు, కార్యదర్శి కృష్ణమూర్తి, శ్రీమన్నారాయణ, గౌతమ్, రాధాకృష్ణ, బత్తుల బ్రహ్మారెడ్డి, రమణ, నాగవీరభద్రాచారి, వెంకటరావు, సురేష్, జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో పోలీసుల కవాతు

చీరాలటౌన్, మార్చి 24: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు చీరాల నియోజకవర్గ పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. ఆదివారం రాత్రి వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో పారా మిలటరీ బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. మార్కెట్, బస్టాండ్, ఫైర్ గేటు, కొట్ల బజార్, స్వర్ణ గేట్, దండుబాట, హరిప్రసాద్ నగర్ ప్రాంతాలలో కవాతు జరిగింది. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణం కలిగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, పారా మిలటరీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలు మృతి

ఇంకొల్లు, మార్చి 24: పొలంలో పిచ్చి మొక్కలు పీకుతుండగా హార్వెస్టర్ తగిలి వృద్ధురాలు మృతిచెందింది. ఈఘటన ఆదివారం భీమవరం గ్రామ పొలాల్లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయచూరు జిల్లా గుడిహాలకు చెందిన లక్ష్మమ్మ పొలం పనులు చేసుకొని జీవనం సాగించేందుకు ఇక్కడికి వచ్చింది. పొలంలో శనగనూర్పిడి చేస్తున్న సమయంలో పిచ్చి మొక్కలు పీకుతున్న లక్ష్మమ్మకు హార్వెస్టర్ తగిలి తీవ్రగాయాలై మృతి చెందింది. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. శవపంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవి తెలిపారు.

బైకిస్టుకు పాము కాటు

బల్లికురవ, మార్చి 24: మండలంలోని సోమవరప్పాడుకు చెందిన కొండవర్తు పిచ్చయ్య పాముకాటుకు గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. ఆదివారం సోమవరప్పాడు గ్రామం నుంచి ఆయన బైకుపై మల్లాయపాలెంకు వస్తున్నాడు. మార్గమధ్యంలోకి వచ్చేసరికి అప్పటికే బైకు ఇంజన్‌పైన ఉన్న పాము బయటకు వచ్చి పిచ్చయ్య కాలిపై కాటువేసి రోడ్డు పక్కన ఉన్న గుట్టలలోకి వెళ్లింది. వెంటనే మల్లాయపాలెంలో బంధువుల సహకారంతో వైద్యశాలకు తరలివెళ్లారు.


మహిళపై దాడి

బల్లికురవ. మార్చి 24: మండలంలోని కొప్పెరపాలెంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ వివాహితపై అదే గ్రామానికి వల్లెపు నాగేశ్వరరావు దాడిచేయడంతో గాయపడ్డారు. తాను ఇంట్లో ఒంటరిగా ఉండటంతో నాగేశ్వరరావు అనే వ్యక్తి వచ్చి అత్యాచారయత్నానికి పాల్పడి కత్తితో దాడి చేశాడని పేర్కొంది. గాయపడిన ఆమెను బంధువులు 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈమేరకు వైద్యశాలలో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

అద్దంకిటౌన్, మార్చి 24: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినికి ఆదివారం రక్తదానం చేశారు. వెంపరాలకు చెందిన విద్యార్థిని రక్తహీనతతో బాధపడుతుండడంతో డాక్టర్ రక్తం అవసరమని చెప్పారు. దీంతో మాధవస్వామి గుడి అర్చకులు భాగవతుల వెంకటాచార్యులు కుమారుడు సూర్యమాల కొండమాచార్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, సందిరెడ్డి శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు అత్తులూరి మృతి



హనుమంతరావు(ఫైల్)

అద్దంకి, మార్చి 24: అద్దంకి మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, వాసవి క్లబ్ మాజీ అధ్యక్షుడు అత్తులూరి హనుమంతరావు(55) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం గుంటూరు వైద్యశాలలో మృతి చెందాడు. హనుమంతరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పలువురు ఆర్యవైశ్యులు హనుమంతరావు మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కంప్యూటర్‌పై అవగాహన పెంచుకోవాలి

మేదరమెట్ల , మార్చి 24: చిన్న పిల్లలకు కంప్యూటర్‌లపై అవగాహన అవసరం అని ఉద్దేశంతో కిరణ్‌జ్యోతి రిచ్చర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. మండలంలోని దైవాలరావూరులో గత 20 సంవత్సరాలుగా విద్యార్థులు, వృద్ధులు, చిన్నారులు, కళాకారులకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ ఆదివారం చిన్నారులకు కంప్యూటర్లు, వాటి పనితీరు గురించి అవగాహన కల్పించారు. కంప్యూటర్ పట్ల అవగాహన ఉంటే చిన్నారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందనే ఉద్దేశంతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కందెపు రాజశేఖర్ అన్నారు. చిన్నారులకు ఆళ్ళ పుష్పాలత, జనని, జహ్నవి, బాలాజి, బద్రీ, తదితరులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఏలూరి

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 24: యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో ఇటీవల విగ్రహ ప్రతిష్ఠ జరిగిన ఆంజనేయస్వామిని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కనపర్తి నాగేశ్వరరావు, నల్లపనేని రంగయ్య చౌదరి, గుదే తారక రామారావు, రావిపాటి సీతయ్య, తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి